సంపుటి : 18
సంచిక : 159
Vol : 18
Issue : 159

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, గురువారం 20 ఆగస్టు 2026
Warangal, Thursday 20 August 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

www.epaper.peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts



WANTED
పీపుల్స్ డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859




సంపుటి : 18
సంచిక : 159
Vol : 18
Issue : 159

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, గురువారం 20 ఆగస్టు 2026
Warangal, Thursday 20 August 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts



WANTED

పీపుల్స్ డైరీ

దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సెంటర్లు

◆ హనుమకొండ ◆ కరీంనగర్ ◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం ◆ జనగామ ◆ మహబూబాబాద్ ◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్

Cell : 9493019044
9618509859

www.epaper.peoplesdairynews.com


www.peoplesdairynews.com


# కాంట్రాక్టర్ల కన్నీటి గాథ

నమ్మి పనులు చేసి... అప్పుల్లో మునిగి...

- తెలంగాణలో గుత్తేదారుల దయనీయ స్థితి
- బిల్లులు రాక బతుకు భారంగా
- హామీలు గాలికి... బిల్లులు పెండింగ్...
- వడ్డీలు పెరిగి ఆస్తులు పోయి
- పాలకులు కనికరం చూపేదెన్నడు?
- బిల్లుల కోసం బిక్కుబిక్కు

7వ పేజీలో..



నాయకుల మాట నమ్మి... నాలుగు అడుగులు ముందేసి, ప్రజల కోసం పనులు చేసి పెద్ద కలలే కట్టుకున్నారు... రోడ్లు వేశారు... వంతెనలు కట్టారు, పాఠశాలలకు కొత్త రూపమిచ్చారు, భవనాలు నిర్మించారు... మేడారం జాతరను ముస్తాబు చేశారు! పనులు పూర్తయ్యాయి గానీ.. పేమెంట్లు మాత్రం ఎందుకు ఆగిపోయాయి? ఒకప్పుడు రోడ్లపై పరుగెత్తిన యంత్రాలు, ఇప్పుడు కాంట్రాక్టర్ల ఇళ్లలో నిశ్శబ్దంగా నిలిచిపోయాయి... "ఇదిగో వస్తుంది..." "అదిగో మంజూరవుతుంది..." అంటూ మాటలు మాత్రం వస్తున్నాయి, బిల్లులు మాత్రం రావడం లేదు! బంగారం అమ్ముకున్నారు... ఆస్తులు తాకట్టు పెట్టారు... వడ్డీకి వడ్డీ కట్టారు... కుటుంబాల కన్నీళ్లను దాచుకున్నారు... పని చేసిన చేతికి బిల్లు అందిన రోజే... అభివృద్ధికి నిజమైన అర్థం...! మరి పాలకులు కాంట్రాక్టర్లపై కనికరం చూపిస్తేనే మరిన్ని పనులు చేపట్టేందుకు ఆస్కారం ఏర్పడుతుంది.

- కొండపర్తి కిరణ్
(ప్రధాన ప్రతినిధి)




# టీఎస్ఎల్‌పీఆర్బీ నూతన విధానం!

- పోలీస్ అభ్యర్థుల వివరాలకు ప్రత్యేకంగా యూనిక్ ఐడీ
- వివాదాలకు తావు లేకుండా ప్రత్యేక చర్యలు

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : తెలంగాణలో పోలీస్ ఉద్యోగ నియామక ప్రక్రియను మరింత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) కీలక చర్యలు చేపడుతోంది. పోటీ పరీక్షల్లో అక్రమాలు, అవకతవకలకు ఏమాత్రం తావు లేకుండా ప్రతి అభ్యర్థి నియామక ప్రక్రియకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఒకే చోట నిక్షిప్తం చేయాలని డిసైడ్ అయింది. అందులో భాగంగా ప్రతి అభ్యర్థికి ప్రత్యేకమైన యూనిక్ ఐడీని కేటాయిస్తోంది. దరఖాస్తు చేసుకున్న నాటి నుంచి ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థి ఎదుర్కొనే ప్రతి దశకు సంబంధించిన సమాచారాన్ని ఈ ఐడీలో నమోదు చేయనున్నారు. అభ్యర్థి ఉద్యోగానికి ఎంపికైనప్పటికీ, ఏదైనా దశలో పోటీ నుంచి తప్పుకున్నప్పటికీ అతడి లేదా ఆమెకు సంబంధించిన పూర్తి వివరాలు భద్రంగా ఉండేలా వ్యవస్థను రూపొందిస్తున్నారు. ఇందులో ఫామ్-ఏ, ఫామ్-బీతో కూడిన ప్రత్యేక ప్రొఫార్మాను సిద్ధం చేస్తున్నారు.

యూనిఫాం సర్వీసుల నియామకాల్లో రాత పరీక్షతో పాటు శారీరక కొలతలు, శారీరక సామర్థ్య పరీక్షలు కూడా కీలకంగా ఉండనున్నాయి. ముఖ్యంగా పీఎంటీ, పీఈటీల నిర్వహణలో అభ్యర్థుల అర్హతలను కచ్చితంగా నమోదు చేయాల్సి ఉంటుంది. (మిగతా 7లో...)

# 'బాబు' అనే పిలుపే పట్టించింది...

- ప్రిన్సిపాల్ రూపారెడ్డి మర్డర్ కేసులో షాకింగ్ ట్విస్ట్..
- చంపింది ఆమె స్కూల్ విద్యార్థులే!
- నిందితుల వద్ద నోట్లపై రక్తం మరకలు కూడా అనుమానికి బలం చేకూర్చాయి...



పీపుల్స్‌డైరీ-నల్గొండ : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో సంచలనం సృష్టించిన నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఆమె పాఠాలు చెప్పిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులే హత్యకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. దోపిడీ కోసం ముందస్తు ప్రణాళికతో ఈ ఘటనకు పాల్పడినట్లు వెల్లడించారు. మైనర్లు కావడంతో వారి వివరాలను బహిర్గతం చేయటం లేదని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 11న రూపారెడ్డి తన ఇంట్లో హత్యకు గురయ్యారు. కేసును ఛేదించేందుకుగాను దేవరకొండ డీఎస్పీ ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. ఫోరెన్సిక్ ఆధారాలు, వేలిముద్రలు, డాగ్ స్క్వాడ్, సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక విశ్లేషణ ఆధారంగా దర్యాప్తు (మిగతా 7లో...)

# అడవి మట్టిలో పుట్టిన రుచి..

- పొలాల్లో కాదు.. పొదల్లో పుడుతుంది..
- ధర పెరిగినా.. డిమాండ్ తగ్గదు..
- కాలం మారినా.. రుచి మారదు..
- ప్రకృతి ప్రసాదించిన ఆరోగ్య వరం.. బోడకాకర!



పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : వర్షం పడగానే పచ్చని అడవులు కొత్త అందాలను సంతరించుకుంటాయి. అదే సమయంలో ప్రకృతి ఒడిలో ఎన్నో అరుదైన ఆహార పదార్థాలు మనకు అందుబాటులోకి వస్తాయి. అలాంటి వాటిలో ఒకటే బోడకాకరకాయ. అడవి కాకర, ఆరోగ్య కాకర అని కూడా పిలిచే ఈ ప్రత్యేకమైన కూరగాయకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంతో ఆదరణ ఉంది. సాధారణ కాకరకాయతో పోలిస్తే ఆకారం, రుచి, లభ్యతలో కొంత భిన్నంగా ఉండే ఈ అడవి కాకర వర్షాకాలంలో మాత్రమే విరివిగా కనిపిస్తుంది.

చేల గట్లలో.. డొంకల్లో.. దట్టమైన పొదల్లో.. అడవుల్లోని చెట్లకు తీగలుగా అల్లుకుని పెరిగే బోడకాకర ప్రకృతి సహజసిద్ధమైన పంటగా గుర్తింపు పొందింది. (మిగతా 7లో...)

# ఐదొందల నోటు హవా..!

- నగదు వ్యవస్థలో దానిదే ఏకఛత్రాధిపత్యం
- నోట్ల విలువలో 85 శాతానికి పైగా ఈ ఒక్క నోటుదే
- చరిత్రలో కలిసిన రెండు వేల నోటు

పీపుల్స్‌డైరీ-బిజినెస్ డెస్క్ :

మన దేశంలో నోట్ల రద్దు తరవాత రూ.2000 నోటు మార్కెట్లోకి వచ్చినప్పుడు దాని హవానే నడిచింది. కానీ ఇప్పుడు సీన్ పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం భారత నగదు వ్యవస్థను ఏకఛత్రాధిపత్యంతో ఏలుతున్న ఏకైక నోటు.. మన రూ.500 మాత్రమే! మనం పర్సు తెరిచినా, మార్కెట్‌కు వెళ్లినా, ఏటీఎం నుంచి డబ్బులు తీసినా మన చేతికి ఎక్కువగా వచ్చేది ఐదొందల నోటే. అయితే ఈ నోటు భారత కరెన్సీ సామ్రాజ్యంలో ఎంతటి పెద్ద పీట వేసిందో తెలుసా? ఏకంగా 85 శాతానికి పైగా నోట్ల విలువ ఈ ఒక్క నోటుదే కావడం గమనార్హం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) విడుదల చేసిన తాజా గణాంకాలే ఈ విచిత్రమైన పరిస్థితిని కళ్ళకు కడుతున్నాయి.

ఆర్‌బీఐ తాజా నివేదిక ప్రకారం.. దేశంలో ప్రస్తుతం చలామణిలో ఉన్న మొత్తం నోట్ల విలువ దాదాపు రూ.42.44 లక్షల కోట్లు. ఇందులో ఒక్క రూ.500 నోట్ల విలువే రూ.36.29 లక్షల కోట్లుగా ఉంది.

(మిగతా 7లో...)



# సీఎం అయ్యాక కళ్లు నెత్తికెక్కాయా..?



- బీసీలంటే అంత చులకనా..?
- రేవంత్ రెడ్డిపై కొండా సుష్మిత సెన్సేషనల్ కామెంట్స్
- పరకాల నుంచి రేవూరిని మళ్లీ ఎలా ప్రకటిస్తారు..
- రేవూరి గెలిచిందే మా సహకారంతో...
- ఏదిఏమైనా పరకాలలో పోటీచేసేది నేనే
- మంత్రి పొంగులేటిపైనా సుష్మిత పరోక్ష విమర్శలు

7లో

# 13 ఏండ్ల బాలిక రాక్షసత్వం

- తాతను మర్డర్ చేయించి ఏమీ ఎరగనట్టు...
- జల్సాలు, ఇతర అవసరాల కోసం
- అడ్డదారులు తొక్కుతున్న టీనేజర్లు...



7వ పేజీలో..

# రాజకీయ లబ్ధి కోసం ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారు

- పథకాలను రద్దు చేసే ప్రసక్తే లేదు
- 299 డివిజన్ మాజీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్



**మేడ్చల్ ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ):-** కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తోందంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని గుండ్లపోచంపల్లి 299 డివిజన్ మాజీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ అన్నారు. పేద కుటుంబాలకు, నిరుపేద ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకాలను రద్దు చేసే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపు మేరకు గుండ్లపోచంపల్లి 299 డివిజన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సాయిపేట శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వ పథకాలపై వాస్తవాలను ప్రజలకు వివరించకుండా బీఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసం ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తూ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై ప్రస్తుతం ఏర్పడిన సమస్యకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని ఆయన తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన ఉత్తర్వులకు సంబంధించిన న్యాయపరమైన అంశాల కారణంగానే కోర్టులో వివాదం ఏర్పడిందన్నారు. చట్టబద్ధత, న్యాయపరమైన అంశాలపై తలెత్తిన సమస్యల నేపథ్యంలో హైకోర్టు తాత్కాలికంగా స్టే విధించడంతో ప్రస్తుతం నిధుల పంపిణీకి ఆటంకం ఏర్పడిందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని రద్దు చేయడం లేదని, న్యాయస్థానం పరిధిలో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సాయిపేట శ్రీనివాస్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం అందించేందుకు చర్యలు చేపడుతోందని, పథకాలకు సంబంధించిన నిధులను గ్రీన్ ఛానల్ ద్వారా విడుదల చేస్తూ వస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుత న్యాయపరమైన సమస్యను పరిష్కరించేందుకు అవసరమైతే హైకోర్టులో అప్పీల్ చేసి పథకాల నిరంతర అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు ప్రజా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బండారి నరేందర్, 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుండ భానుచందర్, లేబర్ సెల్ అధ్యక్షుడు కావలి భాస్కర్, కాంగ్రెస్ యువ నాయకులు వద్దే ప్రవీణ్, షబ్బీర్, సోను, మల్లేష్, ఉదయ్, సంపత్, అనిల్, కిషన్, నందు, సురేష్ రెడ్డి, అఖిల్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు పక్కదారి మళ్లిస్తే కఠిన చర్యలు

**రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



**భూపాలపల్లి ఆగస్ట్ 19 పీపుల్స్ డైరీ..** ఎస్సి, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు పక్కదారి మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఎస్సి, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, ఆర్ ఓ ఆర్, ఉద్యోగుల పదోన్నతులు, ఉప ప్రణాళిక నిధులు వినియోగం, సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పథకాల అమలు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతి తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి వివిధ శాఖల అధికారులతో కమిషన్ చైర్మన్, సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ మంజూరైన నిధులను ఎస్సి, ఎస్టీ ఆవాసాలకు ఖర్చు చేయకపోతే ఆయా శాఖల అధికారులదే భాధ్యత ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రజల సమస్యలను కేవలం కార్యాలయాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని అన్నారు. కేసుల దర్యాప్తు, బాధితులకు న్యాయం, పరిహారం అందించడం వంటి అంశాల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కేసుల పురోగతిని సమర్థవంతంగా పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు సంబంధిత అధికారులను ఆయన అభినందించారు.

### ప్రమోషన్లలో రోస్టర్ రిజర్వేషన్లు తప్పనిసరిగా పాటించాలి

ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే సమయంలో రోస్టర్ రిజర్వేషన్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు.

ప్రమోషన్లలో రిజర్వేషన్ నిబంధనల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, సంబంధిత అధికారులు నిబంధనలను పూర్తిగా పాటించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రాజ్యాంగపరంగా కల్పించిన హక్కులకు భంగం కలగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. బాధితులకు పరిహారంతో పాటు ఉపాధి, పునరావాసం తీవ్రమైన నేరాలకు, ముఖ్యంగా హత్య, అత్యాచారం వంటి ఘటనలకు గురైన ఎస్సీ, ఎస్టీ బాధిత కుటుంబాలను కేవలం పరిహారంతోనే వదిలేయకుండా వారి పునరావాసంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని చైర్మన్ సూచించారు. నిబంధనల ప్రకారం అర్హులైన బాధితులకు పరిహారం అందించడంతో పాటు అవసరాన్ని బట్టి ఉపాధి అవకాశాలు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, గృహ వసతి, పునరావాస సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకునేలా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు.

### ప్రతి గ్రామంలో సివిల్ రైట్స్ డేను సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రతి నెల గ్రామ స్థాయిలో నిర్వహించే సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు కేవలం కింది స్థాయి సిబ్బంది మాత్రమే హాజరుకాకుండా తహశీల్దార్లు, ఎస్ఐలు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు ఎస్సీ, ఎస్టీల హక్కులు, చట్టపరమైన రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అందుబాటులో ఉన్న ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలపై అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామస్థాయిలోనే ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.

### గ్రామాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

గ్రామీణ ప్రాంతాల్లో భూ వివాదాలు, ఇతర నేరాల నియంత్రణకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ఉపయోగకరంగా ఉంటుందని చైర్మన్ పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి పంచాయతీ నిధులు లేదా సీఎస్ఆర్ నిధుల ద్వారా సిసి కెమెరాలు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీటీవీ నిఘా పెంచడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు నేరాలు జరిగినప్పుడు దర్యాప్తుకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విని, వాటిని నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలపై నమ్మకం పెరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించాలని స్పష్టం చేశారు.

### సంక్షేమ పథకాల అమలుపై నిరంతర పర్యవేక్షణ

ఎస్సీ, ఎస్టీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై జిల్లా స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని చైర్మన్ సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, అర్హత ఉన్న వారికి పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలను అధికారులు ప్రాధాన్యతతో పరిష్కరించి, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పేర్కొన్నారు.

### అధికారుల సమన్వయంతోనే మెరుగైన ఫలితాలు

ఎస్సీ, ఎస్టీల సంక్షేమం ఒక్క శాఖ బాధ్యత కాదని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. జిల్లా స్థాయిలో అధికారుల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేసి, క్షేత్రస్థాయిలో పథకాల అమలును పర్యవేక్షించాలని సూచించారు. విదేశీ విద్యా, బాధితులకు పరిహారం, కులాంతర వివాహం చెల్లింపులు పెండింగ్ ఉన్నవాటి నివేదిక అందచేయాలని ఎస్సి అభివృద్ధి అధికారిని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ బాధితులకు కమిషన్ సూచించిన విధంగా ఇళ్ళు కేటాయింపుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి నెలా క్రమం తప్పక పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఎస్పి సంకీర్త్ మాట్లాడుతూ అత్యాచార తదితర సంఘటనలపై తక్షణమే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కమిషన్ నుండి 6 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో మూడు కేసులు విచారణలో ఉన్నట్లు తెలిపారు. అనంతరం చైర్మన్ కు సభ్యులకు జ్ఞాపిక అందచేశారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు కుసురం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మి నారాయణ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఆర్వో వసంత కుమారి, ఎస్సి అభివృద్ధి అధికారి సుకీర్తి జై భీం, ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్, కాటారం, భూపాలపల్లి డీఎస్పీలు సూర్య నారాయణ, సంపత్ రావు, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడివోలు వివిధ శాఖల జిల్లా అధికారులు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గురువుకు ఘన వీడ్కోలు శిష్యుల ఆత్మీయ సత్కారం



**మేడ్చల్ ఆగస్టు 19:-** ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోనిజిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తివిద్య ఉపాధ్యాయుడిగా ఎన్నో సంవత్సరాల పాటు విద్యార్థులకు విద్యాబోధన చేసిన శ్రీ రామ్మోహన్ సార్ పదవీవిరమణ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది. విద్యార్థులకు పాఠాలు చెప్పిన గురువు పదవీ విరమణ చేస్తుండటంతో పూర్వ విద్యార్థులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.

### గురువు సేవలకు గుర్తుగా సన్మానం

ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు రామ్మోహన్ సార్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాభినందనలు తెలిపారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, రామ్మోహన్ సార్ తన వృత్తిపట్ల అంకితభావంతో పనిచేసి విద్యార్థుల అభిమానాన్ని సంపాదించుకున్నారని పలువురు పేర్కొన్నారు.

### రాజకీయాలకు అతీతంగా శిష్యుల కలయిక

ఈ కార్యక్రమంలో ఎల్లంపేటకు చెందిన గౌరారం జగన్ గౌడ్ (మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, ప్రస్తుత బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు), మేడ్చల్ మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ అక్రమ్ పాషా, దబిల్‌పూర్‌కు చెందిన క్రిస్టోఫర్, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్ స్వామి యాదవ్, సంతోష్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నాటి ప్రధానోపాధ్యాయుడు నరసింహయ్య గారి కుమారుడు, రామ్మోహన్ సార్‌కు తోటి విద్యార్థి అయిన సింహ కిషోర్ పటేల్ పాల్గొని గురువును సత్కరించారు. వివిధ రాజకీయ, సామాజిక నేపథ్యాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఒకే వేదికపైకి వచ్చి తమ గురువు పట్ల ఉన్న గౌరవాన్ని చాటుకోవడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### గురువు-శిష్య బంధానికి ప్రతీక

పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజానికి, విద్యార్థులకు అందించిన సేవలకు ఇది ఒక గుర్తింపు అని పలువురు అన్నారు. రామ్మోహన్ సార్ బోధించిన విద్య, అందించిన మార్గదర్శకత్వం తమ జీవితాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం రామ్మోహన్ సార్ కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని పూర్వ విద్యార్థులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షించారు. గురువుకు శిష్యులు ఇచ్చిన ఈ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం గురువు--శిష్య బంధానికి నిదర్శనంగా నిలిచింది.

# అంగరంగ వైభవంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుక



**కమలాపూర్ ఆగస్టు 19( పీపుల్స్ డైరీ ) :** కమలాపూర్ మండల కేంద్రంలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ కమలాపూర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 187 వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మండల ఫోటోగ్రాఫర్ అండ్ వీడియోగ్రాఫర్లు జెండా ఆవిష్కరణ పండుగ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రపంచ ఫోటోగ్రఫీ పితామహుడైన లూయిస్ డాగూరే వర్ధంతి సందర్భంగా తన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 19 తేదీన ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించడం ఎంతో విశేషం 1839లో ఫ్రాన్స్ ప్రభుత్వం డాగ్యూరో టైప్( తొలి ఫోటోగ్రాఫర్ ప్రక్రియ) ఫోటోను ప్రపంచానికి ఉచిత బహుమతిగా ఇచ్చిన రోజును పురస్కరించుకొని ఈ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం జరుపుకుంటారు. అదేవిధంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి ప్రభుత్వ వైద్యశాలలో పేషంట్లకు పండ్ల పంపిణీ చేసి కేక్ కటింగ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కమలాపూర్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విడపు ప్రతాప్ మాట్లాడుతూ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషకరమని అదే విధంగా యూనియన్ అంతా కలిసికట్టుగా ఉండి యూనియన్ కు అన్ని విధాలుగా సపోర్ట్ చేసుకుంటూ ప్రతి ఒక్కరూ ఫోటోగ్రఫీ వృత్తిలో దినదిన అభివృద్ధి చెందాలని ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కుమ్మరి ప్రకాష్. వైస్ ప్రెసిడెంట్ గట్టు రఘు, జీడి సాంబయ్య, ఆనందరావు, క్యాషియర్ దాసరి రమేష్, , ఐలయ్య, హనుమంతు, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత

**శ్రీనివాసా రైస్ మిల్లు గోడంపై దాడి..300 ల క్వింటాళ్ల వరకు స్వాధీనం**



**రేగొండ ఆగస్టు 19 పీపుల్స్ డైరీ..** అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయ్,సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే. రేగొండ మండలం రేగొండ గ్రామ పంచాయతీ శివారులో గల శ్రీనివాసా రైస్ మిల్లు గోడంలో అక్రమంగా నిలువ ఉంచారనే సమాచారం మేరకు సివిల్ సప్లయ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా దాడి చేసి సుమారు 3 నుండి 4 వందల బస్తాల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గత కొన్ని రోజులుగా మిల్లు గోడంలో అక్రమంగా నిలువ చేసిన పిడిఎస్ బియ్యాన్ని నమ్మదగిన సమాచారం మేరకు సివిల్ సప్లయ్ అధికారులు మెరుపు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ప్రజలకు ఉచితంగా అందిస్తున్నపీడీఎస్ బియ్యాన్ని కొందరు అక్రమార్కులు అధికారులతో కుమ్మక్కై పక్కదారి పట్టిస్తున్నారని, అక్రమార్కులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎవరైనా పీడీఎస్ బియ్యాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


# గుంతల రోడ్డులో ప్రయాణం ఎలా?

**ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో భారీ గుంతలతో వాహనదారుల అవస్థలు**



**మేడ్చల్ ఆగస్టు 19(పీపుల్స్ డైరీ):-** ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని జాతీయ రహదారి నుంచి డబిల్‌పూర్ కమాన్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ముఖ్యంగా వర్షం కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తుండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే పరిస్థితి నెలకొంది. ఈ రహదారిపై ద్విచక్ర వాహనాలు, లారీలు, పలు సీడ్ కంపెనీల బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వాహనాల రాకపోకలతో రహదారిపై ఉన్న గుంతలు మరింత పెద్దవిగా మారుతున్నాయి. గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతుండటంతో పాటు వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రధాన రహదారిపై ఇలాంటి పరిస్థితి నెలకొన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే మున్సిపల్ అధికారులు స్పందించి గుంతలను పూడ్చి రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కమిషనర్ సార్.. ఇకనైనా స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టి వాహనదారుల కష్టాలు తీర్చాలని వారు కోరుతున్నారు.

# విద్యుదాఘాతంతో రైతు మృతి



**రేగొండ ఆగస్టు 19 పీపుల్స్ డైరీ :** వ్యవసాయం బావి వద్ద విద్యుత్ మోటార్‌కు మరమ్మతులు చేస్తున్న ఓ రైతు విద్యు దాఘాతంతో బావిలో పడి మృతి చెందాడు. రేగొండ మండలం తిరుమల గిరి గ్రామంలో లో మంగళవారం ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి కి చెందిన మాచర్ల వెంకట్రాజం (55)తన వ్యవసాయ బావి వద్ద మోటారు పంపుసెట్‌కు తన కొడుకుతో మరమ్మతులు చేయిస్తున్నాక్రమంలో కరెంట్ షాక్ కొట్టడంతో పక్కనే ఉన్న బావిలో పడడం వల్ల తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స కోసం హన్మకొండ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు, ఉన్నారు. మృతుని కుమారుడు రాజేష్, ఇచ్చిన పిర్యాదు మేరకు రేగొండ ఎస్సై సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పీపుల్స్ డైరీ
వరంగల్
గురువారం, 20 ఆగస్టు 2026
సంపుటి : 18, సంచిక : 159


## ఏడు సన్నరకాల వరి పండించిన రైతులకే రూ.500 బోనస్



**మెడ్చల్, ఆగస్టు 19(పీపుల్స్ డైరీ):-** ప్రభుత్వం సూచించిన ఏడు సన్నరకాల వరి పంటలను పండించిన రైతులకు మాత్రమే క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ వర్తిస్తుందని మెడ్చల్ మండల వ్యవసాయ అధికారి ఎస్. మాధవ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన సన్నరకాల్లో బిపిటి-5204, హెచ్ఎంటి సోనా, జైశ్రీరామ్, కేఎన్ఎమ్ -1638, కేఎన్ఎమ్-7715, ఆర్ఎన్ఆర్- 15048, డబ్ల్యూజిల్ ఎల్-44 రకాలు ఉన్నాయని పేర్కొన్నారు. విత్తన డీలర్లు, షాపుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన అదే డీలర్ షాపులో తప్పనిసరిగా ఆన్‌లైన్ నమోదు చేయించుకోవాలని సూచించారు. సీడ్ ప్లాంట్లు, యూనివర్సిటీలు, వ్యవసాయ పరిశోధన కేంద్రాల్లో విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు సంబంధిత జెరాక్స్ పత్రాలను సమర్పించాలని తెలిపారు. అదేవిధంగా సొంత విత్తనాలను వినియోగించుకుంటున్న రైతులు స్వయంగా దరఖాస్తు ఫారాన్ని నింపి తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి కు సమర్పించాలని సూచించారు. ప్రభుత్వం అందించే రూ.500 బోనస్ పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మాధవ రెడ్డి స్పష్టం చేశారు.

## రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

**నాణ్యతతో పనులు పూర్తి చేయాలి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



హసన్‌పర్తి, ఆగస్ట్ 19 (పీపుల్స్ డైరీ) : 1వ డివిజన్ పలివెల్పుల గ్రామంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్థానికులతో కలిసి పరిశీలించారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు విస్తరణ పనులను ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, రాకపోకలకు అంతరాయం కలగకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, 1వ డివిజన్ అధ్యక్షుడు చిర్ర రాము, నాయకులు దేవరకొండ అనిల్, సంతోష్, ప్రదీప్, డివిజన్ ముఖ్య నాయకులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు భరోసా కల్పిస్తూ రాములన్న పర్యటన



**సింగరేణి,(కారేపల్లి) ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ):** మండలంలో వైరా మాజీ శాసనసభ్యులు లావుడియా రాములు నాయక్ బుధవారం పలు కుటుంబాలను పరామర్శించి బాధితులకు భరోసా కల్పించారు. వెంకటీయా తండా గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ బానోత్ దేవుల నాయక్ కుమారుడు, ఫారెస్ట్ అధికారి బానోత్ నవీన్ దశదిన కర్మ కార్యక్రమానికి రాములు నాయక్ హాజరయ్యారు. నవీన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం తండా గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాంకుడోత్ నరేష్ పెద్దమ్మ వాంకుడోత్ జమ్ము పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మాజీ రైతుబంధు కన్వీనర్ హన్మకొండ రమేష్, మాజీ సంత చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, సర్పంచులు అంగోత్ మత్రు, బానోత్ కుమార్ ప్రియాంక, మాజీ సర్పంచులు భూక్య రంగారావు, బానోత్ రాందాస్, కుర్సం సత్యనారాయణ, బానోత్ రాందాస్ సంధ్య, వాంకుడోత్ కృష్ణ, మాజీ ఎంపీటీసీ మూడ్ మోహన్ జ్యోతి, మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న, నాయకులు బత్తుల శ్రీనివాస్, అడపా పుల్లారావు, కోటప్పారావు, బబ్బుల ఉపేందర్, భూక్య రాంకిషోర్, బానోత్ రాజేష్, బానోత్ కోటి, ధరావత్ వికాస్, వాంకుడోత్ సతీష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌కు ఎమ్మెల్యే నివాళి



**సింగరేణి,(కారేపల్లి) ఆగస్టు 19 (పేపర్స్ డైరీ):** సింగరేణి మాజీ ఎంపీపీ బానోత్ దేవలా నాయక్ కుమారుడు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ స్వర్గీయ బానోత్ నవీన్ నాయక్ దశదిన కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హాజరై ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నవీన్ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నవీన్ నాయక్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎస్ యు డి ఎ) చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా నియోజకవర్గ పీసీసీ సభ్యులు వడ్డే నారాయణరావు, జిల్లా ఓబీసీ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, సింగరేణి మండల కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూరి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి బానోత్ రామ్మూర్తి నాయక్, అడ్డగోడ ఐలయ్య, వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మద్దిని శ్రీనివాసరావు, గూగులోత్ హర్ష నాయక్, గోపాల్ నాయక్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**హసన్‌పర్తి, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** దేవాలయాల అభివృద్ధికి తనవంతు సంపూర్ణ సహకారం అందిస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం వర్ధన్నపేట నియోజకవర్గంలోని 65వ డివిజన్ కోమటిపల్లి గ్రామం మధురనగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ కూర్మచల అష్టలక్ష్మి సమేత నవనారసింహ వారాహి దేవస్థానం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు, అర్చకులు శ్రీమాన్ సేవాపతి రంగాచార్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ దైవచింతనను అలవర్చుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణానికి నిరంతరం సహకరిస్తున్నామని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భక్తి మార్గాన్ని అనుసరిం చాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో అద్భుతమైన ఆలయాన్ని నిర్మించిన ఆలయ కమిటీ సభ్యులను అభినందిం చారు. కార్యక్రమం లో డివిజన్ అధ్యక్షుడు సునీల్, హసన్‌పర్తి యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ లావుడ్య తిరుపతి, ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, డివిజన్ నాయకులు కుమార్, లింగు, విజయ్, ఆలయ కమిటీ సభ్యులు రమణ, హరీష్, కిషోర్, విజయ్, తిరుపతి, కుమార్, రమేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటీకరణ విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

- ప్రభుత్వ పాలిటెక్నికల్ విద్యను పరిరక్షించాలి
- పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే విధానాలను విరమించుకోవాలి
- జీవో నంబర్ 97/2026ను వెంటనే రద్దు చేయాలి
- ఎస్ బి టి ఈ టిను బలోపేతం చేయాలి: పి వై ఎల్ రాష్ట్ర నాయకులు భూక్య శివ నాయక్



**సింగరేణి, (కారేపల్లి) ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ):** తెలంగాణలో ప్రభుత్వ పాలిటెక్నికల్ విద్యను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం (పి వై ఎల్) తెలంగాణ రాష్ట్ర నాయకులు భూక్య శివ నాయక్ డిమాండ్ చేశారు. కారేపల్లి మండల పరిధిలోని ఎస్సీ హాస్టల్ సెల్ఫ్ మేనేజ్మెంట్ విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా శివ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం వాటి బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధానాలను అవలంబించడం ఆందోళనకరమన్నారు. ఇలాంటి విధానాల వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు సాంకేతిక విద్య అందకుండా పోయే ప్రమాదం ఉందని అన్నారు. జీవో ఎంఎస్ నంబర్ 97/2026 ద్వారా పాలిటెక్నికల్ విద్యకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నికల్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో అనుసంధానం చేయడం లేదా విలీనం చేయడం వంటి చర్యలు చేపడితే ప్రభుత్వ విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆనంద్ మహీంద్రా చైర్మన్‌గా ఉన్న పీపీపీ విధానంలో నడుస్తున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ప్రభుత్వ పాలిటెక్నికల్ విద్యను విలీనం చేసే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ప్రభుత్వ పాలిటెక్నికల్ విద్యను పీపీపీ లేదా ప్రైవేటీకరణకు అప్పగించే చర్యలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పాలిటెక్నికల్ విద్యను పర్యవేక్షించే స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎస్ బి టి ఇ టి) కీలకమైన సంస్థ అని శివ నాయక్ పేర్కొన్నారు. ఎస్ బి టి ఈ టి పాత్రను కొనసాగిస్తూ దానిని మరింత బలోపేతం చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వం తీసుకురావాలని చూస్తున్న ఎస్ హెచ్ ఏ టి ఐ పాలసీ వల్ల పాలిటెక్నికల్ విద్యార్థులు ఉన్నత విద్యలోకి, ముఖ్యంగా లాటరల్ ఎంట్రీ ద్వారా ఇంజనీరింగ్ విద్యలోకి వెళ్లే అవకాశాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల అకడమిక్ భవిష్యత్తుపై స్పష్టత లేకుండా చేసే విధానాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నికల్ విద్యను యథావిధిగా కొనసాగిస్తూ, పేద విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పి వై ఎల్ డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న జీవో నంబర్ 97/2026ను తక్షణమే వెనక్కి తీసుకుని రద్దు చేయాలని, ప్రభుత్వ పాలిటెక్నికల్ విద్యను ప్రైవేటీకరణ నుంచి కాపాడాలని భూక్య శివ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు.

# స్లాట్ బుక్ చేసుకునే నాటి భూములకు క్లియరెన్స్

- 22ఏ క్లియరెన్స్‌కు కలెక్టర్ ప్రత్యేక దృష్టి
- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి వేగం



**మేడ్చల్, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ):-** భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో 22ఏ నిషేధిత జాబితా కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయాలకు వచ్చే సమయానికి సంబంధిత భూమికి 22ఏ క్లియరెన్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు.

**పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక నజర్**

బుధవారం మేడ్చల్ మండలంలోని సబ్-రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలను కలెక్టర్ సందర్శించారు. 22ఏ జాబితాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. అప్‌డేట్ చేసిన జాబితా ప్రకారం ప్రతి దరఖాస్తును పరిశీలించి, అర్హత ఉన్న వాటిని త్వరితగతిన క్లియర్ చేయాలని సూచించారు.

**సర్వే నంబర్ల వారీగా పరిశీలన**

మేడ్చల్, దుండిగల్ తహసీల్దార్ల వద్ద ఉన్న 22ఏ జాబితాలోని దరఖాస్తులను సర్వే నంబర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఉన్న జాబితాలతో సరిపోల్చాలని కలెక్టర్ ఆదేశించారు. లింక్ డాక్యుమెంట్లను పరిశీలించి, పూర్తి స్థాయి వెరిఫికేషన్ అనంతరం సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

**యూఎల్‌సీ కేసులకు ప్రత్యేక ప్రాధాన్యం**

యూఎల్‌సీ కేసుల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న భూములను 22ఏ జాబితా నుంచి క్లియర్ చేయడంలో జాప్యం ఉండకూడదన్నారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

**స్లాట్ బుక్ చేసుకున్న వారికి ఇబ్బందులు లేకుండా..**

ప్రజలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత కార్యాలయానికి వచ్చి 22ఏ సమస్య కారణంగా లావాదేవీ నిలిచిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. స్లాట్ బుక్ చేసుకునే నాటికే సంబంధిత భూమి వివరాలను పరిశీలించి క్లియరెన్స్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

**ప్రజలకు సులభతరమైన రిజిస్ట్రేషన్ లక్ష్యం**

22ఏ నిషేధిత భూముల సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ అశోక్, మేడ్చల్ తహసీల్దార్ భూపాల్, దుండిగల్ తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి, రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# గుంతలకు మరమ్మతులు.. శాశ్వత పరిష్కారం ఎప్పుడో?

- తాత్కాలిక మరమ్మతులతో ప్రజలకు ఉపశమనం.. పూర్తిస్థాయి అభివృద్ధిపై ఆసక్తి
- 297, 298 డివిజన్లలో రోడ్డు పనులు ప్రారంభం



**మేడ్చల్ పూడూర్--కిష్టాపూర్ :** మేడ్చల్ ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ):- మేడ్చల్ పూడూర్--కిష్టాపూర్ 297, 298




డివిజన్ల పరిధిలో రోడ్లపై ఏర్పడిన గుంతలకు మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేపట్టడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలాకాలంగా గుంతలతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులకు ఈ పనులతో కొంత ఉపశమనం లభించనుంది. అయితే గుంతలను పూడ్చడం మాత్రమే కాకుండా రోడ్లకు పూర్తిస్థాయిలో శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాలు పడినప్పుడు గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు.

**చిన్న సమస్యకే ఇన్ని రోజులు.. మరి మిగతా సమస్యల సంగతేంటి?**

ఒక చిన్న రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు కూడా ఇన్ని రోజులు పట్టిందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. డివిజన్లలో ఇంకా అనేక రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని వారు పేర్కొంటున్నారు. ఒక్కో సమస్యకు తాత్కాలిక పరిష్కారం కాకుండా సమగ్ర ప్రణాళికతో శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. ప్రస్తుతం ప్రారంభమైన రోడ్డు మరమ్మతులు ఎంతవరకు నాణ్యంగా జరుగుతాయి? మిగిలిన సమస్యలకు పరిష్కారం ఎప్పుడు లభిస్తుంది? అనే విషయాలపై స్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**ప్రజల ఎదురుచూపు**

పూడూర్--కిష్టాపూర్ డివిజన్లలో అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. గుంతల మరమ్మతులతో మొదలైన పనులు డివిజన్ల సమగ్ర అభివృద్ధికి బాటలు వేస్తాయా? లేక తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడతారా? అన్నది వేచి చూడాల్సిందే.

# ఘనంగా 187 ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



**వీణవంక ఆగస్టు 20( పీపుల్స్ డైరీ) :** మండల ఫోటో వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ రంగానికి గుర్తుగా ఫోటోగ్రాఫిక్ జెండాను ఆవిష్కరించి, అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోటో, వీడియో రంగానికి చెందిన పలువురు సభ్యులు పాల్గొని ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో జరిగే ప్రతి ముఖ్యమైన సంఘటనను ఫోటో, వీడియో రూపంలో భద్రపరుస్తూ ప్రజలకు సేవలందిస్తున్న ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఫోటోగ్రఫీ రంగం మరింత అభివృద్ధి చెందాలని, ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు మంచి భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు. వీణవంక మండల ఫోటో వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సంగేశీ మోహన్ ఎఎస్ఐ వెంక రెడ్డి గౌరవ అధ్యక్షులు ఏలే కుమారస్వామి, ఉపాధ్యక్షులు బాలసాని దేవరాజ్, కార్యదర్శి గాజుల ప్రవీణ్, కుటుంబ భరోసా ఇంచార్జ్ కర్రె నాని యాదవ్, జిల్లా ఫోటోగ్రఫీ కమిటీ ఉపాధ్యక్షుడు తాటిపాముల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు సంగెం సునీల్, ఫోటోగ్రాఫర్లు గంజి భాస్కర్ కంకల సంతోష్ శ్యామ్ సందీప్ శ్రీనివాస్ సాయి షఫీ సంగేశీ సుమన్ పవన్ సాయి సాగర్ చందు అభిలాష్ తాటికంటి రంజిత్ విశ్వనాథ్ శ్రీకాంత్ సంతాజి సభ్యులు పాల్గొన్నారు

# సైదాపూర్ లో ఘనంగా 187 ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



**సైదాపూర్ ఆగస్టు 19 ( పీపుల్స్ డైరీ) :** సైదాపూర్ మండల ఫోటో వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ జెండా ఆవిష్కరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ రంగానికి గుర్తుగా ఫోటోగ్రాఫిక్ జెండాను ఆవిష్కరించి, అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోటో, వీడియో రంగానికి చెందిన పలువురు సభ్యులు పాల్గొని ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో జరిగే ప్రతి ముఖ్యమైన సంఘటనను ఫోటో, వీడియో రూపంలో భద్రపరుస్తూ ప్రజలకు సేవలందిస్తున్న ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఫోటోగ్రఫీ రంగం మరింత అభివృద్ధి చెందాలని, ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న ఫోటోగ్రాఫ ర్లు, వీడియోగ్రాఫర్లకు మంచి భవిష్యత్తు కలగాలని ఆకాంక్షిం చారు. సైదాపూర్ మండల ఫోటో వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గా చంద శ్రీనివాస్ ఫోటోగ్రాఫర్ మండల అధ్యక్షులు బొల్లం నాగేందర్ బాబు పోతారం రాహుల్ గుర్రం కుమా రస్వామి ప్రధాన కార్యదర్శి బొడిగ చంద్రమౌళి కోశాధికారి అనగోని ప్రణయ్ ముఖ్య సలహదారు సతీష్ బొల్లం అభిలాష్ సుద్దాల నరసింహ వెల్ది పరశురాములు బోరగల రమేష్ అరుణ్ అనగొని వంశీ బొల్లం దినేష్

# మాయొరా కార్మికుల ఆందోళనకు సీఐటీయూ మద్దతు

- **18 నెలలుగా అగ్రిమెంట్‌పై కాలయాపన సరికాదు**
- **కార్మికులతో వెంటనే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ నాయకులు లింగస్వామి, నరేష్**



**మేడ్చల్ ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ):-** గుండ్లపోచంపల్లి రెవెన్యూ పరిధిలోని మాయొరా కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత మూడు రోజులుగా కంపెనీ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నారు. కార్మికుల ఆందోళనపై కంపెనీ యాజమాన్యం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరైన పద్ధతి కాదని సీఐటీయూ నాయకులు లింగస్వామి, నరేష్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాయొరా కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు అగ్రిమెంట్ చేయకుండా యాజమాన్యం 18 నెలలుగా కాలయాపన చేయడం అన్యాయమని అన్నారు. వెంటనే కార్మికులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించి, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన ఒప్పందం**

ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని, ఆ ప్రభావం కార్మిక కుటుంబాలపై తీవ్రంగా పడుతోందని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు ప్రయోజనం చేకూరే విధంగా అగ్రిమెంట్ రూపొందించాలని డిమాండ్ చేశారు. అగ్రిమెంట్‌లో కేవలం వేతనాల అంశమే కాకుండా కార్మికుల కుటుంబ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని వారి ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని కంపెనీ యాజమాన్యాన్ని కోరారు.

**కార్మికుల పోరాటానికి సంపూర్ణ మద్దతు**

మాయొరా కంపెనీ కార్మికులు చేస్తున్న ధర్నాకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని లింగస్వామి, నరేష్ తెలిపారు. భవిష్యత్తులో కార్మికులకు ఎలాంటి అవసరం వచ్చినా సీఐటీయూ అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందని స్పష్టం చేశారు. "ప్రపంచ కార్మికులారా ఏకంకండి" అనే నినాదంతో సీఐటీయూ పనిచేస్తోందని, ఎక్కడ కార్మికులకు అన్యాయం జరిగినా వారి తరఫున నిలబడి పోరాటాలు నిర్వహిస్తామని నాయకులు తెలిపారు. కార్మికుల సమస్యలను మరింత జాప్యం చేయకుండా యాజమాన్యం వెంటనే స్పందించి చర్చలు జరిపి, న్యాయ-ంమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

# ఘనంగా టిఆర్పీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జన్మదిన వేడుకలు

- **కరీంనగర్ జిల్లాలో ఘనంగా టిఆర్పీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్ అన్న జన్మదిన వేడుకలు..**



**కరీంనగర్: ఆగస్టు 19 పీపుల్స్ డైరీ :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్ అన్న గారి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కరీంనగర్ జిల్లాలో టిఆర్పీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘనంగా విద్యార్థుల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమంతో పాటు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదం రజినీ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అఖిల్ పాషా మాట్లాడుతూ.. మాదం రజినీ కుమార్ అన్నకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజల కోసం మరింత సేవ చేసే శక్తి, నూతన ఉత్సాహం కలగాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా, విద్యార్థుల భాగస్వామ్యంతో మరియు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా పేదలు, విద్యార్థులు, బలహీన వర్గాల సంక్షేమం కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం పనిచేస్తుందని అఖిల్ పాషా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ సహాయ కార్యదర్శి మహబూబ్ అలీ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, టౌన్ ప్రధాన కార్యదర్శి ఎగుర్ల రమేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ, కార్యదర్శి ఇశ్రత్ శావాలి, కొత్తపెల్లి మండల అధ్యక్షులు ఓర్సు రాజు నాయకులు, మైనార్టీ ప్రధాన కార్యదర్శి అంకుష్ శావాలి, జడగల శ్రీనివాస్ పార్టీ నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# కరీంనగర్ పాల డైరీ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన చైర్మన్ రాజేశ్వరరావు



**హుస్నాబాద్ టౌన్ : (పీపుల్స్ డైరీ) ఆగస్టు 19 :** హుస్నాబాద్ మండలంలోని తోటపల్లి గ్రామంలో కరీంనగర్ డైరీ పాల ఉత్పత్తిదారుల సేవా కేంద్రాన్ని కరీంనగర్ డైరీ చైర్మన్ రాజేశ్వరరావు ప్రారంభించారు. జికా నిధుల కింద ఏర్పాటు చేసిన కంటైనర్ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం ప్రకృతి, కాల పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని, ఒక్కోసారి పంటలు ఆశించిన స్థాయిలో పండక రైతులు ఇబ్బందులు పడుతుంటారని అన్నారు. అయితే పాడి పరిశ్రమ రైతులకు నిరంతర ఆదాయాన్ని అందించే రంగంగా నిలుస్తోందని పేర్కొన్నారు. పాడి రైతులు ఎన్నో కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ పశువులను పోషిస్తూ కుటుంబాలను నడిపిస్తున్నారని, వారి కష్టాన్ని గుర్తించి కరీంనగర్ డైరీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. పాల ఉత్పత్తిని పెంచడంతో పాటు పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి అవసరమైన సహకారం, సేవలను మరింత చేరువ చేసేందుకు డైరీ తరఫున చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోనే సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా రైతులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా డైరీకి సంబంధించిన సేవలను సులభంగా పొందే అవకాశం కలుగుతుందని అన్నారు. పాడి రైతులు నాణ్యమైన పశువుల పెంపకం, పశువుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పాల ఉత్పత్తిని పెంచుకోవాలని సూచించారు. తోటపల్లిలో సేవా కేంద్రాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని చైర్మన్ రాజేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బంక లక్ష్మీ చందు, స్థానిక డైరీ అధ్యక్షులు ఆంజనేయులు, డైరెక్టర్లు పంపరి రాజు, దొంతరబోయిన మహేష్, బోనాల కుమార్, చాతబోయిన రమేష్, మానుక కుమార్,డైరీ సెక్రటరీ రాజ్ కుమార్, మేనేజర్ నాగయ్య, సూపర్వైజర్ వీరస్వామి, పాడి రైతులు, గ్రామస్తులు, కరీంనగర్ డైరీ సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**కరీంనగర్ జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షు లు చిన్నింటి నాగేంద్ర ఆధ్వర్యంలో**



**జమ్మికుంట ఆగస్టు 19 పీపుల్స్ డైరీ :** జమ్మికుంట పట్టణం. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని, కరీంనగర్ జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లాఉపాధ్యక్షుల చిన్నింటి నాగేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా జమ్మికుంట లోని శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయం బొమ్మల గుడిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలో జమ్మికుంట మండలంలోని లోని పలువురు ఫోటోగ్రాఫర్లు మరియు వీడియోగ్రాఫర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవ గుణాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా అసోసియేషన్ఉపాధ్యక్షులు మాట్లాడుతూ, సమాజానికి నిత్యం సేవనందిస్తున్న ఫోటోగ్రాఫర్లు కేవలం కళాకారులు మాత్రమే కాకుండా సామాజిక బాధ్యత కలిగి ఉంటారని తెలిపారు. ప్రతి ఏటా ఆగస్టు 19న వచ్చే ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఇలాంటి సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన అందరికీ అసోసియేషన్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు చిన్నింటి నాగేంద్ర. రచ్చ గణేష్. బి కే వెంకన్న. విజయగిరి రాంబాబు. బిట్ల తిరుపతి. గండి రంజిత్ కుమార్ కొక్కుల శ్రీరాములు. కోటగిరి కుమార్. పంజాల గణేష్. భాస్కర్. సత్యం. పొనగంటి రాజు. పవన్ బండి. కృష్ణ. శివ సాయి. అంబాల హరీష్. తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలలో పాల్గొన్న..

**స్థానిక శాసన సభ్యులు కౌశిక్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్**




**జమ్మికుంట ఆగస్టు 19 పీపుల్స్ డైరీ :** జమ్మికుంట పట్టణ పరిధిలోని డీమ్ ర్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన ప్రపంచ ఫోటోగ్రఫీ వేడుకలలో హుజురాబాద్ శాసనసభ్యులు శ్రీ పాడి కౌశిక్ రెడ్డి తో కలిసి పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ జమ్మికుంట ఫోటోగ్రాఫర్స్ కి ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఒక్క ఫోటో వెయ్యి జ్ఞాపకాలను,ఎన్నో భావోద్వేగాలను మన కళ్లముందు నిలుపుతుంది కాలం గడిచినా మధుర జ్ఞాపకాలను పదిలంగా భద్రపరిచే అద్భుతమైన కళే ఫోటోగ్రఫీ ప్రపంచాన్ని కొత్త కోణంలో చూపించేది ఫోటోగ్రాఫర్ అని తెలిపారు ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్,,ఫోటోగ్రాఫర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిన్నింటి నాగేందర్ జమ్మికుంట అధ్యక్షులు ముస్తఫా,శివకుమార్ నాగరాజు,అనిల్ కుమార్,బిట్ల తిరుపతి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జీవో 97 రద్దు చేయాలి...

**పాలిటెక్నిక్ విద్యార్థుల మానవహారం..**



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) ఆగస్టు 19 :** టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను 'శక్తి' శాఖలో విలీనం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హుస్నాబాద్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మానవహారంగా ఏర్పడి కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఐటీఐ, పాలిటెక్నిక్ విభాగాలను శక్తి శాఖలో విలీనం చేయడం వల్ల విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్య పూర్తిచేసిన అనంతరం బీటెక్‌లో ప్రవేశాలకు సీట్ల సంఖ్య పెంచాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. శక్తి పథకాన్ని అమలు చేయడం కంటే పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉన్నత విద్యలో మెరుగైన అవకాశాలు కల్పించాలని కోరారు. విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి స్పందించి విలీన ప్రక్రియను ఉపసంహరించుకుని జీవో 97ను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ పెంచడంతో పాటు పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని, కళాశాల తరగతులు, పరీక్షలు బహిష్కరిస్తామని విద్యార్థులు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ లోకి ఆహ్వానించిన మంత్రి



**చిగురుమామిడి,ఆగస్టు19 (పీపుల్స్ డైరీ):** కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు,ప్రజా ప్రభుత్వం పనితీరు,చిగురుమామిడి గ్రామ అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీలోకి చేరానన్న సర్పంచ్ ఆఖవరం భవాని శివప్రసాద్.హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు,మాజీ జెడ్పిటిసి గీకురు రవీందర్, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పోలు స్వప్న ఘన స్వాగతం పలికిన తదితర నాయకులు.

పీపుల్స్‌డైరీ
వరంగల్
గురువారం, 20 ఆగస్టు 2026
సంపుటి : 18, సంచిక : 159


# గర్రెపల్లి సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి



**సైదాపూర్ ఆగస్టు 19 ( పీపుల్స్ డైరీ ):** సైదాపూర్, ఆగస్టు 19: కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గర్రెపల్లి గ్రామానికి పల్లె బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు విద్యార్థుల రవాణా, విద్యుత్, రహదారి, దేవాలయాలు, ఇందిరమ్మ ఇళ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దోకిడి తిరుపతి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు.గ్రామానికి ఇప్పటివరకు బస్సు సౌకర్యం లేక ప్రజలు, వృద్ధులు, మహిళలు, రైతులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు మోడల్ స్కూల్‌కు వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల పాఠశాల సమయాలకు అనుగుణంగా ఉదయం, సాయంత్రం గర్రెపల్లి మీదుగా పల్లె బస్సు సర్వీసును ప్రారంభించాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ హయాంలోనే గ్రామానికి మొట్టమొదటి పల్లె బస్సు ప్రారంభం కావాలన్నది గ్రామ ప్రజల ఆకాంక్షగా తెలిపారు.

**విద్యుత్ వైర్లతో ప్రమాదం :** గ్రామం మధ్యలో విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని, ట్రాక్టర్లు, వ్యవసాయ వాహనాలు, స్కూల్ బస్సులు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ స్తంభాలను సరిచేసి వైర్లను సురక్షితంగా ఏర్పాటు చేయాలని కోరారు.

**బ్రిడ్జి వద్ద సీసీ రోడ్డు నిర్మించాలి :** గర్రెపల్లి--సైదాపూర్ ప్రధాన రహదారిలోని బ్రిడ్జి వద్ద ఇరువైపులా సుమారు 50 అడుగుల మేర 9 అంగుళాల మందంతో సీసీ రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో వాహనాల రాకపోకలు సురక్షితంగా సాగుతాయని తెలిపారు.

**దేవాలయాల సమస్యలు పరిష్కరించాలి :** రోడ్డు ఎత్తు పెరగడంతో హనుమాన్ దేవాలయం రోడ్డు స్థాయి కంటే దిగువకు వెళ్లిపోయిందని, వర్షాకాలంలో ఆలయం వద్ద నీరు చేరే అవకాశం ఉందని తెలిపారు. ఆలయాన్ని పరిరక్షించేలా అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. పోచమ్మ గుడి స్థలానికి సంబంధించిన సమస్యను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పాత రికార్డులు, గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

**ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో న్యాయం చేయాలి :** గర్రెపల్లి గతంలో ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సమయంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు తక్కువగా వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం గర్రెపల్లి ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పడినందున, ఇతర గ్రామపంచాయతీలకు కేటాయిస్తున్న విధంగా తగిన సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి గ్రామానికి న్యాయం చేయాలని కోరారు.గర్రెపల్లి గ్రామానికి ఇప్పటివరకు లేని పల్లె బస్సును మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించి, విద్యార్థులు, గ్రామ ప్రజల రవాణా సమస్యకు పరిష్కారం చూపాలని దోకిడి తిరుపతి విజ్ఞప్తి చేశారు.

# అంగన్‌వాడీ టీచర్ అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన



**మేడ్చల్, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ):**-మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని ఐసీడీఎస్ మేడ్చల్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన ప్రక్రియను బుధవారం సీడీపీవో కార్యాలయంలో నిర్వహించారు. అభ్యర్థులు సమర్పించిన దరఖాస్తులు, విద్యార్హతలు, జనన తేదీ, స్థానికత, కుల ధృవపత్రాలు తదితర పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ ప్రక్రియను మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సందర్శించి పరిశీలించారు. అభ్యర్థులు సమర్పించిన ధృవపత్రాల ప్రామాణికతను నిర్ధారించేందుకు సంబంధిత శాఖల రికార్డులతో సరిపోల్చి తనిఖీ చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, రెవెన్యూ శాఖ, ఇంటర్మీడియట్ విద్యాశాఖకు చెందిన అధికారులు, సిబ్బంది ఈ పరిశీలనలో పాల్గొని సహకరించారు. అంగన్‌వాడీ టీచర్ల నియామక ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.నియామక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తామని జిల్లా సంక్షేమ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

# కోటంచలో స్వాతి నక్షత్ర పూజలు..



**రేగొండ ఆగస్టు 19 పీపుల్స్ డైరీ..** కోటంచ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని విశేష పూజలు ప్రతి నెలలో స్వాతి నక్షత్రంలో లోక కల్యాణర్థం సంప్రదాయరీతిలో కళ్యాణ వేడుకలు కొనసాగాయి. వేకువ జామునే స్వయం భువులను కొలిచిన అర్చకులు. ఆలయంలోని స్వామి వారికి అష్టోత్తర శతఘటాభిషేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ కల్యాణమండపంలో 108 కలశాలకు పూజలు జరిపారు.పంచసూక్త పఠనంతో హోమం నిర్వహించి ఉత్సవ మూర్తులను, ప్రతిష్ఠ అలంకార మూర్తులను అభిషేకించారు. తులసీ దళాలతో సహస్ర నామార్చనలు జరిపారు. ఉదయం స్వామి అమ్మవార్లను రథసేవలో తీరిదిద్ది గ్రామ పురవీధుల్లో ఊరేగించనున్నారు.స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా భక్తులు వేకువ జామునే ఆలయంలో ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో స్వాతి నక్షత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఈ ఓ బిల్ల శ్రీనివాస్,ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, బుచ్చమచర్యులు,ఆలయ చైర్మెన్ నాయినేని సంపత్ రావు,ఆలయ సిబ్బంది శ్రవణ్ కుమార్,రవివర్మ, సుధాకర్,గ్రామస్తులు పాల్గొన్నారు..

# గాజులరామారం యూపీహెచ్‌సీలో డీఎంహెచ్ఓ ఆనంద్ ఆకస్మిక తనిఖీ

- **విధుల్లో నిర్లక్ష్యంపై ఆగ్రహం.. వైద్య సేవలు మెరుగు పరచాలని ఆదేశం**



**మేడ్చల్ ఆగస్టు 19(పీపుల్స్ డైరీ):-** మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా డీఎంహెచ్ఓ డా. కె. ఆనంద్ గాజులరామారం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా విధుల్లో ఉండాల్సిన మెడికల్ ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషియన్ (ఎల్‌టీ) ముందస్తు అనుమతి లేకుండా విధులకు హాజరుకాకపోవడాన్ని గుర్తించారు. దీనిపై సంబంధిత సిబ్బందిని వివరణ కోరుతూ, విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. యూపీౕ వాచ్‌సీలోని మందుల నిల్వలను స్టాక్ రిజిస్టర్‌తో సరిపోల్చి పరిశీలించారు. మందుల లభ్యతతో పాటు సమీప గడువు (నియర్ ఎక్స్‌పైరీ) ఉన్న మందులను తనిఖీ చేసి, వాటిని సకాలంలో వినియోగించడం, స్టాక్‌ను సక్రమంగా నిర్వహించడం వంటి అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు.అదేవిధంగా యాంటీ రేబీస్ వ్యాక్సిన్, యాంటీ స్నేక్ వీనం నిల్వలు, వాటి నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. వ్యాక్సిన్‌లు, ఇతర అత్యవసర మందుల కోల్డ్‌చైన్ నిర్వహణపై కూడా తనిఖీ చేశారు. రికార్డుల్లో నమోదైన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లోని సమాచారంతో క్రాస్ వెరిఫై చేశారు. యూపీహెచ్‌సీలో వైద్య సేవల పనితీరుపై డీఎంహెచ్ఓ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రజలకు అందాల్సిన ప్రాథమిక ఆరోగ్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా తక్షణమే పనితీరును మెరుగుపర చాలని సిబ్బందిని ఆదేశించారు. అవుట్‌పేషెంట్ (ఓపీ) సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు గర్భిణీలకు సంబంధించిన ఏఎన్‌సీ సేవలు, ఎన్‌సీడీ స్క్రీనింగ్, చికిత్సా సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. యూపీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలతో సమన్వయం చేసుకుని హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, అర్హులైన విద్యార్థులకు టీకాలు వీలైనంత త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని డా. కె. ఆనంద్ ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

# ప్రజా సేవలో ముందుండాలి-రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలవాలి



**మేడ్చల్ ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ):-** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాలకుర్తి రాఘవేందర్ గౌడ్ జన్మదిన వేడుకలు రాజకీయ వర్గాలు, అభిమానులు, అనుచరుల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మేడ్చల్ ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ నాయకులు రాఘవేందర్ గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. రాఘవేందర్ గౌడ్ ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకుడని పేర్కొన్నారు. మేడ్చల్ ప్రాంత ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా కార్మికులు, ఆటో డ్రైవర్లు, పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలపై మరింతగా దృష్టి సారించాలని కోరారు.

**వచ్చే ఎన్నికల్లో కార్పొరేటర్‌గా భారీ మెజార్టీతో విజయం సాధించాలి**

రాబోయే ఎన్నికల్లో పాలకుర్తి రాఘవేందర్ గౌడ్ కార్పొరేటర్‌గా పోటీ చేసి భారీ మెజార్టీతో విజయం సాధించాలని ఆటో యూనియన్ నాయకులు ఆకాంక్షించారు. ప్రజల నమ్మకాన్ని చూరగొని మేడ్చల్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కోరారు. ప్రజా సమస్యలను తన సమస్యలుగా భావించి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాఘవేందర్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని ప్రజాసేవా కార్యక్రమాలు చేపట్టి రాజకీయంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ 297 అధ్యక్షుడు ఎర్ర విజయరావు, వెంకటేష్ ముదిరాజ్, కలీల్ బాబు, కుమార్, రమేష్, సుధాకర్, సత్యనారాయణ, సురేష్ ముదిరాజ్, గణేష్, దుర్గపతి తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ సప్లై అధికారుల మెరుపు దాడి..444.75 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

**శ్రీనివాస పాత రైస్ మిల్ గోడౌన్‌లో నిల్వ..**



**రేగొండ, ఆగస్టు 19పీపుల్స్ డైరీ:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని శ్రీనివాస పాత రైస్ మిల్ గోడౌన్‌లో నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ రాజు సంబంధిత అధికారులతో కలిసి బుధవారం ఉదయం గోడౌన్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో పెద్ద మొత్తంలో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే విషయాన్ని డీఎం, డీఎస్ఓలకు తెలియజేయడంతో సివిల్ సప్లై అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని బియ్యాన్ని పరిశీలించారు. అనంతరం పంచనామా నిర్వహించి బియ్యం బస్తాలను లెక్కించి తూకం వేశారు. ఈ తనిఖీల్లో సుమారు 444.75 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభ్యమైనట్లు అధికారులు గుర్తించారు. బియ్యాన్ని అధికారికంగా స్వాధీనం చేసుకుని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భద్రతా నిమిత్తం రేగొండ మారుతి ఇండస్ట్రీస్ రైస్ మిల్లు వద్దకు తరలించి ఉంచారు. ప్రభుత్వ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, రవాణా చేయడం లేదా దారి మళ్లించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై అత్యవసర వస్తువుల చట్టం-1955, వర్తించే పీడీఎస్ నియంత్రణ నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులకు అందిన సమాచారం మేరకు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి పీడీఎస్ బియ్యాన్ని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్ రాహుల్, డీసీఎస్ఓ, డీఎం, సివిల్ సప్లై రేగొండ ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు. రైస్ మిల్ యజమాని శ్రీనివాస్, తూర్పాటి శ్రీనివాస్, సాంబశివుడు, వాహన యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులు తెలిపారు.

# గడపగడపకు బీజేపీని తీసుకెళ్లాలి: బైరి శంకర్ ముదిరాజ్



- **బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి: శ్రీకాంత్ యాదవ్**

**ఎల్కతుర్తి, ఆగస్టు 19( పీపుల్స్ డైరి ) :** ఎల్కతుర్తి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశం బుధవారం బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బైరి శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ, గడపగడపకు బీజేపీ పార్టీని తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా సైనికుల్లా పనిచేయాలని పి లు ఎ ు ని చ్చా ు ర ు . ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను ప్రతి కుటుంబానికి వివరించి, బీజేపీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని అన్నారు. ఉచిత రేషన్ బియ్యం, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, జన్‌ధన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు శక్తి కేంద్రాలను క్రియాశీలం చేసి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉండాలని కోరారు. రానున్న రోజుల్లో ఎల్కతుర్తి మండలంలో బీజేపీని మరింత బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేష్, ఎల్కతుర్తి మండల ప్రభారి లక్కిరెడ్డి తిరుమలరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల కుమార్, జిల్లా కార్యదర్శి పృథ్వీరాజ్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, ఎస్టీ మోర్చా అధ్యక్షులు మోహన్ నాయక్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు నత్తి శివకుమార్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్, సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి సామల సురేష్ రెడ్డి, మండల పదాధికారులు, కార్యవర్గ సభ్యులు, వివిధ మోర్చాల నాయకులు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలకు తహసీల్దార్ భూపాల్‌కు ఘన సన్మానం




**మేడ్చల్ ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ):-** ప్రజలకు అందిస్తున్న సేవల్లో అంకితభావంతో పనిచేస్తూ ఉత్తమ పనితీరు కనబరిచిన మేడ్చల్ తహసీల్దార్ భూపాల్‌కు ఘన సన్మానం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు అందుకున్న భూపాల్‌ను మున్సిపల్ కౌన్సిలర్లు సురేష్ రెడ్డి, వేణుగోపాల్ గౌడ్, చిన్నోళ్ల భాస్కర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ తహసీల్దార్ భూపాల్ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ, విధుల పట్ల నిబద్ధతతో పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేసినప్పుడే ప్రజలకు పాలన మరింత చేరువవుతుందని అన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ తహసీల్దార్‌గా గుర్తింపు పొందడం మేడ్చల్ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో భూపాల్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ తహసీల్దార్ భూపాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# కాంట్రాక్టర్ల కన్నీటి గాథ

- నమ్మి పనులు చేసి... అప్పుల్లో మునిగి...
- తెలంగాణలో గుత్తేదారుల దయనీయ స్థితి
- బిల్లులు రాక బతుకు భారంగా
- హామీలు గాలికి... బిల్లులు పెండింగ్...
- వడ్డీలు పెరిగి ఆస్తులు పోయి
- పాలకులు కనికరం చూపేదెన్నడు?

**కొండపర్తి కిరణ్ (ప్రధాన ప్రతినిధి)**



నాయకుల మాటలు నమ్మి.. అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు పూర్తి చేసిన చిన్న, మధ్యతరహా కాంట్రాక్టర్లు ఇప్పుడు పెండింగ్ బిల్లులు రాక, వడ్డీల భారం తాళలేక తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నారు. తెలంగాణలో గ్రామీణ రవాణా, రోడ్లు, భవనాలు, పాఠశాలల ఆధునీకరణ తదితర స్థానిక అభివృద్ధి పనులను శరవేగంగా చేపట్టిన చిన్న, మధ్యతరహా కాంట్రాక్టర్లు నేడు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మంత్రులు ఇచ్చిన హామీలను, నమ్మకాన్ని ఆసరాగా చేసుకొని ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద, బ్యాంకుల్లో భారీగా అప్పులు తెచ్చి పనులు పూర్తి చేశారు. అయితే ఏళ్లు గడుస్తున్నా బిల్లులు మంజూరు కాకపోవడంతో వేలాది మంది కాంట్రాక్టర్ల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.

**మేడారం జాతర పనులు**
**కోట్ల ఖర్చు.. చేతిలో ఉత్తుత్తి టోకెన్లు**

పరిస్థితి అత్యంత దయనీయంగా మారిన ప్రాంతాల్లో మేడారం మహాజాతర అభివృద్ధి పనులు ఒకటి. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారంలో భక్తులకు వసతులు, రహదారులు, తాగునీరు, పారిశుధ్య పనుల కోసం ప్రభుత్వం శరవేగంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించింది. ప్రజాప్రతినిధుల మాటలను విశ్వసించిన కాంట్రాక్టర్లు కోట్ల రూపాయలు సొంతంగా, అప్పుల రూపంలో సమీకరించి రాత్రింబవళ్లు శ్రమించి పనులు పూర్తి చేశారు. జాతర ముగిసి నెలలు గడుస్తున్నా, నామమాత్రపు టోకెన్ నంబర్లు ఇచ్చి చేతులు దులుపుకోవడమే తప్ప ఖాతాల్లో పైసా జమ కాలేదు.

**'ఇదిగో.. అదిగో' అంటూ ముఖం చాటేస్తున్న ప్రజాప్రతినిధులు**

కాంట్రాక్టర్లు తాము నమ్ముకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోంది. పనులు ప్రారంభించే సమయంలో బిల్లులు వెంటనే ఇప్పిస్తాం అని హామీ ఇచ్చిన నాయకులు, ఇప్పుడు కాంట్రాక్టర్లు బిల్లుల కోసం వస్తే బడ్జెట్ లేదు ఫైల్ ఆర్థిక శాఖలో ఉంది ఇదిగో వస్తుంది అదిగో వస్తుంది అంటూ దాటవేసే ధోరణి ప్రదర్శిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు ముఖం చాటేస్తుండటంతో, కాంట్రాక్టర్లకు ఎవరికి చెప్పుకోవాలో తెలియని దిక్కులేని పరిస్థితి ఏర్పడింది.

**వడ్డీల భారం.. వేలం వేస్తున్న ఆస్తులు**

అప్పులు తెచ్చిన వడ్డీ వ్యాపారుల నుండి ఒత్తిళ్లు పెరగడం బ్యాంకు నోటీసులు రావడంతో చాలామంది కాంట్రాక్టర్లు తమ సొంత ఆస్తులు, బంగారాన్ని అమ్ముకోవాల్సిన దుస్థితికి చేరారు. బిల్లులు రాక, కొత్త పనులు చేయలేక, మరోవైపు తెచ్చిన అప్పులకు వడ్డీ చక్రవడ్డీగా మారి కాంట్రాక్టర్ల మెడకు ఉరితాడులా మారుతోంది. ఈ ఆర్థిక ఒత్తిడి వల్ల కొందరు కాంట్రాక్టర్లు తీవ్ర అస్వస్థతకు గురికాగా, మరికొందరు తీవ్రమైన మానసిక ఆందోళనలో గడుపుతున్నారు.

**కాంట్రాక్టర్ల సంఘాల నిరసనలు**

రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల విలువైన బిల్లులు ఆయా శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్నాయని కాంట్రాక్టర్ల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విశ్వసనీయ వర్గాల నివేదిక ప్రకారం చిన్న కాంట్రాక్టర్లకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి బకాయిలు చెల్లించాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (BAI) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

మరోవైపు కాంట్రాక్టర్ల ఆందోళనలపై స్పందించిన ప్రభుత్వం, దశలవారీగా బకాయిలు క్లియర్ చేస్తామని హామీ ఇచ్చింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఆర్అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రతినిధులతో భేటీ అయి చిన్న కాంట్రాక్టర్ల బకాయిల విడుదలకు చర్యలు తీసుకుంటామని హామీలు ఇచ్చి ప్రభుత్వం ఇప్పటికే చిన్న మొత్తాల బిల్లుల క్లియరెన్స్‌కు కొంత నిధులు విడుదల చేసినప్పటికీ, మేడారం పనులతో సహా భారీ ప్రాజెక్టుల పెండింగ్ బిల్లులు త్వరితగతిన చెల్లిస్తేనే తమకు విముక్తి లభిస్తుందని కాంట్రాక్టర్లు స్పష్టం చేస్తున్నారు.

**పరిష్కారం దిశగా అడుగులు పడాలి**

ప్రజా శ్రేయస్సు కోసమే అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లను ఆదుకోవడం ప్రభుత్వ నైతిక బాధ్యత. బడ్జెట్ సాకులతో కాంట్రాక్టర్లను ఆర్థికంగా చిన్నాభిన్నం చేయకుండా, టోకెన్ ఆధారంగా ప్రాధాన్యతా క్రమంలో పెండింగ్ బిల్లులు త్వరితగతిన విడుదల చేయాలని, ప్రజాప్రతినిధులు కూడా బాధ్యతాయుతంగా స్పందించి వారికి అండగా నిలవాలని కాంట్రాక్ట్ వర్గాలు కోరుతున్నాయి.

# సీఎం అయ్యాక కళ్లు నెత్తికెక్కాయా..?

- బీసీలంటే అంత చులకనా..?
- రేవంత్ రెడ్డిపై కొండా సుష్మిత సెన్సేషనల్ కామెంట్స్
- పరకాల నుంచి రేవూరిని మళ్లీ ఎలా ప్రకటిస్తారు..
- రేవూరి గెలిచిందే మా సహకారంతో...
- ఏదిఏమైనా పరకాలలో పోటీచేసేది నేనే
- మంత్రి పొంగులేటిపైనా సుష్మిత పరోక్ష విమర్శలు



**పీపుల్స్‌డైరీ-వరంగల్ :** తెలంగాణ కాంగ్రెస్‌లో పరకాల అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయాలు రోజురోజుకూ వేడెక్కుతున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల సభలో పిలుపునివ్వడం ఇప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. పరకాల నుంచి రేవూరిని మళ్లీ పోటీ చేయిస్తామని సీఎం ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తూ రేవంత్‌రెడ్డి, వరంగల్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి పొంగులేటిని శ్రీనివాస్ రెడ్డిని ఉద్దేశించి పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు.

'సీఎం రేవంత్ రెడ్డిని నేను కొన్ని ప్రశ్నలు అడగదలుచుకున్నా. మీరు మొదట పీసీసీ కావాలని కోరుకున్నది కొండా సురేఖ, కొండా మురళి. ఆరోజు కొండా మరళి ఆదేశాల మేరకు కొండా సురేఖ పీసీసీగా రేవంత్ రెడ్డిని ప్రపోజ్ చేసింది. ఢిల్లీ స్థాయిలో కూడా కొండా సురేఖ ప్రపోజ్ చేసింది. పీసీసీ అయ్యాక మొట్టమట్నదటగా మా ఇంటికే వచ్చారు. ఆ రోజు మా ఇంటికి వచ్చి మా నాన్న కొండా మురళిని ఎమ్మెల్సీ చేస్తానని మాట ఇవ్వలేదా..? మైసమ్మ, ఎల్లమ్మ మీద ప్రమాణం చేసి చెప్పు. ఓ బీసీ బిడ్డ, ప్రజల మనిషికి ఎందుకు ఎమ్మెల్సీ ఇవ్వలేదని నేను అడుగుతున్నా. మీరు పరకాలకు వచ్చి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్ రెడ్డిని గెలిపించాలని చెప్పినవ్. అసలు ఎవరు రేవూరి ప్రకాశ్ రెడ్డి. పరకాల అంటే ఆయనకు తెలియదు. పరకాలకు రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలియదు.

వచ్చే ఎన్నికలు ఎందుకు ఎప్పుడే రాజీనామా చేయమను చేసి గెలవమని చెప్పు. నువ్వు వచ్చి ప్రచారం చేయ్.. రేవూరి గెలుస్తడా.. కొండా కుటుంబం నుంచి గెలుస్తరా తెలుస్తది. మేం లేకపోతే రేవూరి ప్రకాశ్ రెడ్డి గెలిచేవాడే కాదు. నాలుగైదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన వ్యక్తి మీకు ఎందుకు గుర్తొస్తలేదు. ముఖ్యమంత్రి అయితే కళ్లు నెత్తికెక్కినయా..? నాకు భయం లేదు. చావుకు కూడా బయపడను. మా నాన్న అలా పెంచాడు. ఇవాళ మీతో పాటు ఓ పొంగు ఉన్నది.. ఆ పొంగు ఎక్కువ సేపు పొంగదు. నువ్వు ముఖ్యమంత్రివా.. ఆయన ముఖ్యమంత్రివా తెలియట్లేదు. ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రి పొన్నం ఫోటో వేయకుండా ఆ పొంగు ఫోటో వేశారు. బీసీలంటే అంత చులకనా..?' అని కొండా సుష్మిత హాట్ కామెంట్స్ చేశారు.

సుస్మిత చేసిన తాజా వ్యాఖ్యల నేపథ్యంలో వరంగల్ పాలిటిక్స్ రసవత్తరంగా మారాయి. ఇప్పటికే సుష్మిత తాను పరకాల నుంచి పోటీ చేసేందుకు రెడీ అయ్యాయని హింట్ ఇస్తూ 'అప్ కమింగ్ ఎమ్మెల్యే పరకాల' అని ఇన్‌స్టా పోస్టు పెట్టారు.

# అడవి మట్టిలో పుట్టిన రుచి..

(2వ పేజీ తరువాయి)

ముఖ్యంగా ఆషాఢ మాసం నుంచి శ్రావణ మాసం చివరి వరకు ఇవి ఎక్కువగా లభిస్తాయి. వర్షాలు కురిసిన తర్వాత అడవి ప్రాంతాల్లో వీటి కాయలు విరివిగా కాస్తాయి. దీంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులు, చిన్నారులు, పశువుల కాపరులు అడవుల్లోకి వెళ్లి వీటిని సేకరించి స్థానిక మార్కెట్లలో విక్రయిస్తుంటారు.

బోడకాకర ప్రత్యేకతల్లో ముఖ్యమైనది దీని సహజసిద్ధమైన పెరుగుదల. సాధారణ పంటల మాదిరిగా ఎక్కడ పడితే అక్కడ సాగు చేయడం సాధ్యం కాదని స్థానిక రైతులు చెబుతుంటారు. దట్టమైన పొదలు, అడవి వాతావరణంలో సహజంగా మొలకెత్తి తీగలుగా విస్తరించి పూతకు వచ్చి కాయలు కాస్తుంది. అందుకే ఏడాదిలో కొద్దికాలం మాత్రమే లభించే ఈ కాకరకు ప్రత్యేకమైన డిమాండ్ ఉంటుంది.

బోడకాకరను కేవలం రుచికరమైన కూరగాయగానే కాకుండా పోషక విలువలు కలిగిన ఆహారంగా కూడా గ్రామీణ ప్రజలు భావిస్తారు. ఇందులో బి-విటమిన్లు, మెగ్నీషియం, ఫోలిక్ యాసిడ్, జింక్, ఫాస్పరస్, మాంగనీస్, పీచు పదార్థాలు వంటి పోషకాలు ఉంటాయని చెబుతారు. సమతుల ఆహారంలో భాగంగా తీసుకుంటే శరీరానికి అవసరమైన పలు పోషకాలు అందే అవకాశం ఉంది.

ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలను నియంత్రించడంలో కాకరకాయ ఉపయోగపడుతుందని ప్రజల్లో చాలాకాలంగా నమ్మకం ఉంది. అయితే బోడకాకర తింటే షుగర్, బీపీ పూర్తిగా రాకుండా ఉంటాయని లేదా వ్యాధులు నయం అవుతాయని చెప్పడం శాస్త్రీయంగా నిర్ధారించబడలేదు. మధుమేహం, రక్తపోటు ఉన్నవారు వైద్యుల సూచనతోనే మందులు కొనసాగిస్తూ, దీనిని సాధారణ ఆరోగ్యకరమైన కూరగాయగా ఆహారంలో చేర్చుకోవడం మంచిది.

**ఏడాదికి ఒక్కసారైనా రుచి చూడాలంటారు!**

గ్రామీణ ప్రాంతాల్లో బోడకాకరకు ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు. ఏడాదిలో కొద్దిరోజులు మాత్రమే దొరికే ఈ అడవి కాకరను ఒక్కసారైనా రుచి చూడాలని చాలామంది ఆసక్తి చూపుతారు. సాధారణ కాకరకాయతో పోలిస్తే ప్రత్యేకమైన రుచి ఉంటుందని స్థానికులు చెబుతారు. అందుకే మార్కెట్‌లో ధర కాస్త ఎక్కువగా ఉన్నప్పటికీ కొనుగోలు చేసేందుకు వెనుకాడరు.

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోనూ బోడకాకరకు డిమాండ్ పెరుగుతోంది. లభ్యత తక్కువగా ఉండటంతో ప్రాంతాన్ని బట్టి కిలో రూ.200 నుంచి రూ.300 వరకు ధర పలుకుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

**ప్రకృతి ఇచ్చిన సీజనల్ సంపద**


వర్షాకాలం వస్తే అడవుల్లో పచ్చదనం ఎంత పెరుగుతుందో.. ప్రకృతి ప్రసాదించే అరుదైన ఆహార పదార్థాల సందడి కూడా అంతే పెరుగుతుంది. అలాంటి ప్రకృతి వరాల్లో బోడకాకర ఒకటి. ప్రత్యేకమైన రుచి, సీజనల్ లభ్యత, పోషక విలువల కారణంగా దీనికి ప్రత్యేక స్థానం ఏర్పడింది.



అయితే ఆరోగ్య ప్రయోజనాల విషయంలో అతిశయోక్తులకు దూరంగా ఉండాలి. బోడకాకర ఆరోగ్యకరమైన ఆహారంలో ఒక భాగం మాత్రమే.. ఏ వ్యాధికీ ప్రత్యామ్నాయ మందు కాదు. ప్రకృతి ఒడిలో పుట్టి, వర్షాకాలంలో మాత్రమే మన ముందుకు వచ్చే ఈ అరుదైన కూరగాయను అందుకే గ్రామీణులు ప్రేమగా "ఆరోగ్య కాకర" అని పిలుస్తారు.

# ఎఫ్‌సిఐ జీఎం ను కలసిన ఉమ్మడి జిల్లా రైస్ మిల్లర్స్ ప్రతినిధులు

- కొత్త బియ్యం డెలివరీ కి గోదాముల్లో స్థలం కేటాయించాలి
- రాక్ మూమెంట్ చేసి పాత బియ్యాన్ని తరలించాలి
- జిఎం అనూజ్ త్యాగి కి వినతి



**పీపుల్స్‌డైరీ-ములుగు :** ఎఫ్ సి ఐ జి ఎం అనూజ్ త్యాగి ని బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ మాట్లాడారు. ఎఫ్ సి ఐ గోదాములలో కొత్త బియ్యం స్టోరేజ్ చేయటానికి స్థలాలు లేకపోవడంతో పాటు పాత బియ్యాన్ని తరలించేందుకు రాక్ మూమెంట్ సైతం చేయకపోవడం వల్ల మిలర్లు ఇబ్బంది పడాల్సి వస్తుందని అన్నారు. అదేవిధంగా రైస్ మిల్లర్లు ఆర్థికంగా కూడా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నే ఉమ్మడి జిల్లా ప్రతినిధులమంత హైదరాబాద్ కి ఎఫ్ సి ఐ జి ఎం ను కలవడం జరిగిందని ఆయన తెలిపారు. మిల్లర్ల సమస్యల దృష్టి లో ఉంచుకొని వెంటనే ఎఫ్ సి ఐ గోదాములల్లో స్థలాలు ఏర్పాటు అయ్యే విధంగా చూడటం తోపాటు రాక్ మూమెంట్ చేయాలని కోరినట్టు తెలిపారు. అందుకు జిఎం సానుకూలంగా స్పందిస్తూ.. సెప్టెంబర్ నెలలో రాక్ మూమెంట్ చేయటం తోపాటు గోదాముల్లో స్థలాల కోసం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్టు ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ తో పాటు కార్యదర్శి సహోదర రెడ్డి ,వరంగల్ జిల్లా కార్యదర్శి బూరెల సత్యనారాయణ ,కోశాధికారి ఇరుకు కోటేశ్వరరావు, మహబూబాబాద్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, సీనియర్ రైస్ మిల్లర్ యుగంధర్, శ్రావణ్ పాల్గొన్నారు.

# ఐదొందల నోటు హవా...

(2వ పేజీ తరువాయి)

అంటే శాతాల్లో చెప్పాలంటే మొత్తం నోట్ల విలువలో 85.5 శాతం కేవలం ఐదొందల నోట్లతోనే నిండిపోయింది. మన దేశంలో తిరుగుతున్న మొత్తం నోట్లలో దాదాపు 41.3 శాతం నోట్లు రూ.500 కరెన్సీవే. సంఖ్య పరంగా చూస్తే సగానికంటే తక్కువగానే ఉన్నప్పటికీ, విలువ పరంగా చూస్తే మాత్రం 80 శాతానికి పైగా మార్కెట్‌ను ఈ ఒక్క నోటే ఏలేస్తోంది.

ఐదొందల నోటు అంత పెద్ద పీట వేస్తే, మరి మన పాత రూ.100, రూ.200 నోట్ల పరిస్థితి ఏమిటనే సందేహం రావచ్చు. రూ.500 తర్వాత ఆ స్థాయిలో రూ.100 నోటు రెండో స్థానంలో నిలిచింది. చలామణిలో ఉన్న రూ.100 నోట్ల మొత్తం విలువ రూ.2.80 లక్షల కోట్లుగా ఉంటే, రూ.200 నోట్ల విలువ రూ.2.13 లక్షల కోట్లుగా ఉంది. ఇక చిన్న కరెన్సీ నోట్లయిన రూ.50 నోట్లు రూ.55,161 కోట్లు, రూ.20 నోట్లు రూ.28,633 కోట్లు, రూ.10 నోట్లు రూ.28,215 కోట్ల మేర మార్కెట్లో ఉన్నాయి. చివరికి రూ.2, రూ.5 నోట్లన్నీ కలిపినా వాటి విలువ రూ.4,230 కోట్లకు మించకపోవడం విశేషం.

ఒకప్పుడు హడావుడి చేసిన రూ.2000 నోటు ఇప్పుడు దాదాపుగా తుడిచిపెట్టుకుపోయింది. ప్రభుత్వం ఈ నోట్లను వెనక్కి తీసుకోవడంతో ప్రస్తుతం మార్కెట్లో ఇవి కేవలం 0.12 శాతం మాత్రమే మిగిలాయి. రూ.2000 నోటు ఉపసంహరణ తర్వాతే ప్రజలంతా రూ.500 నోట్లపై తీవ్రంగా ఆధారపడటం మొదలుపెట్టారు. దానికితోడు యూపీఐ, గూగుల్ పే, ఫోన్ పే వంటి డిజిటల్ లావాదేవీలు ఆకాశాన్నంటుతున్నప్పటికీ, దేశంలో నగదు వినియోగం తగ్గకపోవడం మరొక ఆసక్తికరమైన అంశం. నిత్యం డిజిటల్ చెల్లింపులు చేస్తున్నప్పటికీ, మార్కెట్లో మాత్రం క్యాష్ కింగ్‌గా రూ.500 నోటే రాజ్యమేలుతోంది!

# టీఎస్ఎల్‌పీఆర్‌బీ నూతన విధానం

(2వ పేజీ తరువాయి)

అదే సమయంలో రిజర్వేషన్లకు అనుగుణంగా వర్టికల్, హారిజంటల్ కేటగిరీల్లో కటాఫ్ మార్కులను ఖరారు చేయటం కూడా కీలకమైన అంశం. ఈ దశలో ఏ చిన్న పొరపాటు జరిగినా అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు ఫిర్యాదులు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రతి దశలో అభ్యర్థి సాధించిన మార్కులు, శారీరక సామర్థ్యం, అర్హతలు తదితర వివరాలను యూనిక్ ఐడీతో అనుసంధానం చేయనున్నారు. ప్రాథమిక రాతపరీక్షకు ముందు అభ్యర్థి పార్ట్ 1 దరఖాస్తు సమర్పించాలి. అందులో పేర్కొన్న వివరాలనే ప్రామాణికంగా పరిగణిస్తారు. ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించినవారు తదుపరి దశకు పార్ట్ 2 దరఖాస్తును పూర్తి చేయాల్సి ఉంటుంది. .

పార్ట్-2 నమోదు అనంతరం నిర్వహించే పీఎంటీ, పీఈటీ ఫలితాలతో పాటు తుది రాతపరీక్షలో అభ్యర్థి సాధించిన మార్కులు, ర్యాంకు, ఎంపికకు సంబంధించిన ఇతర వివరాలు కూడా యూనిక్ ఐడీలో చేరతాయి. అంతే కాకుండా అభ్యర్థుల పూర్వచరిత్రపై స్పెషల్ బ్రాంచ్ నిర్వహించే విచారణకు సంబంధించిన సమాచారాన్ని కూడా అందులో పొందుపరచనున్నారు. నియామక ప్రక్రియపై భవిష్యత్తులో ఏవరైనా అభ్యంతరం వ్యక్తం చేసినా.. ఫిర్యాదు చేసినా.. న్యాయస్థానాన్ని ఆశ్రయించినా పూర్తి వివరాలు తక్షణమే పరిశీలించే అవకాశం ఉంటుంది. దీంతో నియామక ప్రక్రియలో పారదర్శకత పెరగటంతో పాటు రికార్డుల నిర్వహణ సులభతరం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. అభ్యర్థి దరఖాస్తు నుంచి తుది ఎంపిక వరకు ప్రతి దశను డిజిటల్ ఆదారం ఉండటం వల్ల వివాదాలకు ఆస్కారం తగ్గుతుందని చెబుతున్నారు.

# 13 ఏండ్ల బాలిక రాక్షసత్వం

- తాతను మర్డర్ చేయించి ఏమీ ఎరగనట్టు...
- జల్సాలు, ఇతర అవసరాల కోసం
- అడ్డదారులు తొక్కుతున్న టీనేజర్లు...

**పీపుల్స్‌డైరీ-క్రైం బ్యూరో :** యువత రాను రాను అడ్డదారులు తొక్కుతున్నారు. చదువులు మానేసి లవ్, డ్రగ్స్, మద్యం అంటూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. డబ్బు కోసం కన్నతల్లిదండ్రులను కూడా చంపేసేంత రాక్షసంగా మారుతున్నారు. తాజాగా కేరళలో ఇలాంటి ఓ షాకింగ్ ఘటన జరిగింది. కంటికి రెప్పలా చూసుకుంటున్న తాతనే కిరాతకంగా హతమార్చింది ఓ మైనర్ బాలిక. వినడానికి షాకింగ్ గానే ఉన్నా ఇది నిజం. తన స్నేహితులతో కలిసి తాతను చంపించింది. ఆ భయానక దృశ్యాలను వీడియో కాల్ లో చూస్తూ రాక్షసానందం పొందింది. తాత వద్ద ఉన్న డబ్బు, ఫోన్ కోసమే ఇంతటి దారుణానికి ఒడిగట్టినట్లు తేలింది. తన 17 ఏళ్ల బాయ్ ఫ్రెండ్ కు బైక్ కొనివ్వడం కోసం ఆ బాలిక ఈ దారుణానికి పాల్పడినట్లు స్పష్టం అవుతోంది. ఈ ఘటన కేరళలో సంచలనంగా మారింది. రాను రాను యువత ఎలా మారుతున్నారనేది ఈ ఘటన సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.

ఈ దారుణమైన ఘటన ఆగస్టు 15 న రాత్రి జరిగింది. ఆ సమయంలో ఇంట్లో వృద్ధుడు (67) ఒంటరిగా ఉన్నాడు. అంతకుముందు బాధితుడి చిన్న కుమార్తె ప్రసవం కోసం సమీపంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో చేరింది. ఇక ఆయన భార్య తోడుగా వెళ్లడంతో రూమ్ లో ఒంటరిగా వృద్ధుడు ఉన్నాడు. ఇదే అవకాశం అనుకున్న 13 ఏళ్ల బాలిక తన ముగ్గురు ఫ్రెండ్స్ తో కలిసి తాతను హత్య చేసేందుకు పక్కా ప్లాన్ వేసింది. బాలిక వీడియో కాల్ లో ఆ ఇంట్లోకి ఎలా వెళ్లాలో తెలిపింది. అలా బాత్ రూమ్ వెంటిలేటర్ ద్వారా వృద్ధుడి రూమ్ లోకి వెళ్లారు మైనర్ లు. బెడ్ పై ఒంటరిగా పడుకుని ఉన్న వృద్ధుడి కాళ్లు చేతులు కట్టేశారు. ఆ తర్వాత నోట్లో గుడ్డలు కుక్కి, తలను గోడకేసి కొట్టారు. అలా ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. ఈ దారుణమైన దృశ్యాలను ఆ మనవరాలు వీడియో కాల్ లో లైవ్ లోనే చూసింది.

ఈ దారుణాన్ని ఆ మనవరాలు వీడియో కాల్‌లో లైవ్‌గా చూసింది. హత్య చేశాక ఆ నిందితులు ఇంట్లోని 4.5 తులాల బంగారంతో అక్కడి నుంచి పరార్ అయ్యారు. ఇక ఆగస్టు 16 న అంటే హత్య జరిగిన మరుసటిరోజున బాలిక సాధారణంగానే ప్రవర్తించింది. అలా ఆ రోజంతా ఎలాంటి భయం, ఆందోళన లేకుండా సరదాగా గడిపింది. ఆగస్టు 17న తాత తలుపులు తీయడం లేదని.. మద్యం సేవించి నిద్రపోయాడేమోనని స్థానికులకు వివరించింది. దాంతో స్థానికులు తలుపులు తీసి చూసేసరికి ఆ వృద్ధుడు శవమై కనిపించాడు. దాంతో అందరూ ఒక్కసారిగా షాక్ అయ్యారు. అయితే బాలిక మాత్రం ఎలాంటి అనుమానం రాకుండా స్కూల్ కు వెళ్లింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# 'బాబు' అనే పిలుపే పట్టించింది...

(2వ పేజీ తరువాయి)

కొనసాగించారు. సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో 70కి పైగా సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించడంతో పాటు 80 మందికిపైగా అనుమానితులను విచారించారు. ఈ క్రమంలో పోలీసులకు ఓ చిన్న ఆధారం కీలకంగా మారింది. ఘటనకు ముందు రూపారెడ్డి తన చిన్నమ్మతో ఫోన్‌లో మాట్లాడిన సమయంలో చివరిగా ఆమె "బాబు" అని పలికినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం ఆమె ఫోన్ స్విచ్‌ఆఫ్ కావడంతో ఆ ఒక్క మాటపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. పాఠశాలలో రూపారెడ్డి విద్యార్థులను సాధారణంగా బాబు అని పిలిచేవారని తెలుసుకున్న పోలీసులు దర్యాప్తును విద్యార్థుల వైపు మళ్లించారు.



ఇద్దరు పదో తరగతి విద్యార్థుల కదలికలపై అనుమానం రావడంతో వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీని విశ్లేషించిన తర్వాత అనుమానాలు మరింత బలపడ్డాయని పోలీసులు తెలిపారు. ప్రిన్సిపల్ హత్య తర్వాత ఆ స్కూల్‌కు నాలుగురోజులు సెలవులు ఇచ్చారు. రీఓపెన్ తర్వాత గైర్హాజరైన 13 మంది విద్యార్థుల గురించి ఆరా తీయగా... వారిలో ఐదుగురు పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. అందులో ఇద్దరు రెండు మూడు రోజుల నుంచి డబ్బు ఖర్చు చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు దొనియాల ఎక్స్‌రోడ్డు వద్ద బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద రూ.1.54 లక్షల డబ్బు లభించింది. అందులోని మూడు రూ.500 నోట్లపై రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు.

విచారణలో రూపారెడ్డిని హత్య చేసి ఆమె ఇంట్లోని నగదును తీసుకెళ్లినట్లు ఇద్దరూ అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

# విలేకరిపై దాడి.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేయాలి



**గణపురం, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** చిట్యాల మండలంలోని చింతకుంట రామయ్యపల్లి గ్రామానికి చెందిన రైతుకు జరిగిన అన్యాయంపై వార్తను కవర్ చేసిన ఆర్‌బీ న్యూస్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరి పుల్ల రవితేజపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని దళిత బహుజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసుతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేయాలని కోరారు. బుధవారం గణపురం మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు తిక్క సంపత్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుకు జరిగిన అన్యాయంపై విలేకరి రవితేజ వార్తను ప్రసారం చేయడాన్ని కొందరు జీర్ణించుకోలేక ఆదివారం రాత్రి ఆయన ఇంట్లోకి చొరబడి దాడికి పాల్పడటం దారుణమన్నారు. ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కులం పేరుతో దూషిస్తూ అసభ్య పదజాలంతో దూషించి రవితేజపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఇంట్లో మహిళలు ఉన్నప్పటికీ వారిని పట్టించుకోకుండా దాడికి పాల్పడటం అమానుషమని పేర్కొన్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు, డీఎస్పీ తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులను గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### వార్త సేకరించడం విలేకరి వృత్తి ధర్మం

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, వాటిపై వార్తలను సేకరించి ప్రసారం చేయడం విలేకరుల వృత్తి ధర్మమని దళిత బహుజన సంఘాల నాయకులు అన్నారు. వార్తలు రాయడం, ప్రసారం చేయడం గిట్టని వారు విలేకరులపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. నిందితులు ఎంతటి వారైనా చట్టం ముందు అందరూ సమానులేనని స్పష్టం చేశారు. విలేకరి రవితేజపై దాడి ఘటనలో నిందితులపై వెంటనే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా యూత్ అధ్యక్షులు పసునూటి శంకర్, అంబేద్కర్ సంఘం మండల నాయకులు దూడపాక శ్రీనివాస్, చిలువేరు ఉదయాకర్, ఆలూరు మొగిలి, కుక్క ముడి బాబు, మైనార్టీ మండల నాయకులు ఎండి సైదులు పాషా, గద్దమీద సాంబయ్య, మాదాసు లక్ష్మణ్ పాల్గొన్నారు.

# క్రమశిక్షణతోపనిచేసిన పసర ఎస్ఐకు ప్రశంస పత్రం



**గోవిందరావుపేట, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధి పసర ఎస్సై తాజొద్దీన్ క్రమశిక్షణతో వీధిలో నిర్వహించినందున ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ బుధవారం ఎస్సై తాజొద్దీన్‌కు ఉత్తమ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ములుగు ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక పోక్సో కోర్టులో పోక్సో కేసుకు సంబంధించి తీర్పు వెలువడింది. వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నవంబర్ 14న2023 కేసులో నిందితుడికి కోర్టు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.4,200 జరిమానా విధించడం జరిగిందన్నారు, పోలీసుల కదనం ప్రకారం వెంకటాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఐపీసీ సెక్షన్లు 354-డి , 448, 290, 506తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 11(ఆర్) రెడ్ విత్ 12 కింద కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు, ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్.వి.పి. సూర్యచంద్ర కళ తీర్పు వెలువరించారు. కేసులో నిందితుడైన కొండాపూర్ గ్రామానికి చెందిన ల్యాదల్ల రాజనీకాంత్ (20)కు కోర్టు నేరం రుజువైన నేపథ్యంలో శిక్ష విధించింది. కేసు విచారణ సందర్భంగా పోలీసుల తరఫున సమర్థవంతంగా వాదనలు వినిపించారు. పోక్సో కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేలా దర్యాప్తు, కోర్టు పర్యవేక్షణ, ప్రాసిక్యూషన్ సమన్వయంతో పనిచేస్తున్న పోలీసు అధికారులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్‌పి మనన్ బట్, అడిషనల్ ఎస్పీ సదానందం, రవీందర్ పాల్గొన్నారు.

## నేడు నల్లబెల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

**నల్లబెల్లి, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** మండల ప్రజల కంటి ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా జనతా ట్రస్ట్, శంకర ఐ ఫౌండేషన్ ఇండియా మరియు శ్రీ కాంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నేడు (ఆగస్టు 20, 2026) ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడుతోంది.స్థానిక సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9:00 గంటల నుండి ఈ శిబిరం కొనసాగుతుంది. ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులు కంటి సమస్యలను పరీక్షించి, అవసరమైన వారికి తగిన చికిత్సను సూచిస్తారు. వివరాలకు 9949963083, 9908315974, 9908422162 నంబర్లలో సంప్రదించవచ్చు.

# విద్యారంగానికి పెద్దపీట..

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ



**మంచిర్యాల, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** చెన్నూరు మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ. 1.45 కోట్ల వ్యయంతో చేపట్టిన ఆధునీకరణ పనులు పూర్తికావడంతో నూతనంగా నిర్మించిన మొదటి అంతస్తును రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భం గా మంత్రి, ఎంపీలు మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో, పేద కుటుంబాల జీవితాల్లో మహత్తర మార్పులు సాధ్యమవుతాయని, తమ పాలనలో విద్యారంగానికి, ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. మహనీయులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, డాక్టర్ జి. వెంకటస్వామి (కాకా) ఆశయాల బాటలోనే నడుస్తూ నియోజకవర్గాన్ని విద్యా రంగంలో ముందంజలో నిలుపుతామని, గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన చదువు, ఆధునిక వసతులు అందించడమే తమ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బోర్‌వెల్ తవ్వించి నీటి ఎద్దడి తీర్చడమే కాకుండా, రూ. 1.45 కోట్లు మంజూరు చేయించి కళాశాల స్వరూపాన్నే మార్చివేసినందుకు మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి : మంత్రి సీతక్క



**గోవిందరావుపేట, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధి పసర గ్రామానికి చెందిన రైస్ మిల్ యాజమాని జీవన్ జి జనార్ధన్ హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి దనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గత కొంతకాలంగా పరిశీలిస్తున్న జనార్ధన్, పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సేవా కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు జీవన్ జి.జనార్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క జీవంజి జనార్ధన్‌ను కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తూ, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కలిసి పనిచేయాలని సూచించారు. జీవంజి జనార్ధన్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పసరా గ్రామంతో పాటు ములుగు నియోజకవర్గంలో పార్టీకి మరింత బలం చేకూరుతుందని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్, గణపాక సుధాకర్, బూర సురేందర్, అనిల్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బూర సురేందర్ గౌడ్, గుండబోయిన అనిల్ యాదవ్, గణపాక సుధాకర్, భైరి అభిలాష్, తండా కృష్ణ, సిద్ధు, సాయి పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలు..

## పోచమ్మ మైదాన్ సెంటర్ లో భారీ కేక్ కట్ చేసి వాహనదారులకు హెల్మెట్లు, పేదలకు దుప్పట్లు పంపిణీ..



**మట్టెవాడ , ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ):** రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలు వరంగల్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గోపాల నవీన్ రాజ్ ఆధ్వర్యంలో పోచమ్మ మైదాన్ సెంటర్ లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలకు మంత్రి కొండా సురేఖ మురళీధర్ దంపతుల కూతురు, కాంగ్రెస్ యువనాయకురాలు కొండా సుస్మిత పటేల్ (చిట్టక్క) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణుల మధ్య కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గోపాల నవీన్ రాజ్, వరంగల్ జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ లతో కలిసి కొండా సుస్మిత పటేల్ 62 కిలోల భారీ కేకును కట్ చేశారు. అనంతరం జర్నలిస్టులు, వాహన దారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ కార్మికులు, పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. పోచమ్మ మైదాన్ సెంటర్ లో అన్నదానం నిర్వహించారు. కొండా దంపతుల అభిమానులు మంత్రి కొండా సురేఖ ఫోటోతో ఉన్న టీషర్టులను ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కొండా దంపతుల అభిమానులు పాల్గొన్నారు.

## కొత్తవాడలో కొండా పుట్టినరోజు వేడుకలు

**మట్టెవాడ, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ నగరంలోని 23వ డివిజన్ కొత్తవాడలో శ్రీ భక్త మార్కండేయస్వామి ఆలయంలో రాష్ట్ర అటవీ దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం మార్కండేయ స్వామి సన్నిధిలో అర్చన, అభిషేకం టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత, ఆలయ అర్చకులు క్యాతం శివకుమార్ శాస్త్రి చేతుల మీదుగా చేయించారు. కార్యక్రమంలో చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు దాసరి రాజశేఖర్, బొల్లు సతీష్, దేవర రాము, దొంతుల ఉమ, కళ్లపెల్లి వాణి, ములుక సరిత, కందకట్ల విజలక్ష్మి, భాగ్యలక్ష్మి, వెల్ది రేవతి, మోతుకూరి సావిత్రి, రమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.



## మార్కెట్లో భారీ కేక్ కటింగ్, పండ్ల పంపిణీ



**మట్టెవాడ, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ):** వరంగల్ జిల్లా కూరగాయల మార్కెట్ వర్తక సంఘం ఆధ్వర్యంలో బుధవారం లక్ష్మీపురం కూరగాయల మార్కెట్లో రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కటింగ్ చేసి హమాలీ కార్మికులకు, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కూరగాయల మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు జారతి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, సెక్రటరీ గులాం సర్వర్, కోశాధికారి మల్లూరి బాబురావు, కర్ర వెంకటేశ్వరరావు, పర్శ వీరన్న, గోపి, శీలం సత్యనారాయణ, జారతి వెంకటేశ్వర్లు, రాజు, నాగరాజు, పి.యాకూబ్, ఈ.శరత్, వెంకటేశ్వర్లు, వరయోగుల శ్రీను, యోగి, రణదీప్, చిన్న, హమాలి కార్మికులు గట్టికొప్పుల సాంబయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ డే

**శాయంపేట, ఆగస్టు 19,(పీపుల్స్ డైరీ) :** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా వెలుగు ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెండా ఎగరవేయడం జరిగింది. అనంతరం మండల కేంద్రంలోని గర్ల్స్ హై స్కూల్‌లో పిల్లలకు పండ్లు అందజేశారు. మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొత్తపల్లి శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా మామిడి రాజు,ప్రధాన కార్యదర్శిగా మామిడి భాస్కర్, కోశాధికారులుగా గుండేటి కమలాకర్, నిమ్మల సాంబమూర్తిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు సూర్యదేవర వీరన్న ,గౌరవ అధ్యక్షులు పైడిమల్ల సుధాకర్ లు పాల్గొన్నారు.

# ఫోటోగ్రఫీ వృత్తికాదు శక్తివంతమైన సాధనం

## యూనియన్ మండల అధ్యక్షులు నాసాని విద్యాసాగర్



**మొగుళ్ళపల్లి, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటోగ్రఫీ అనేది కేవలం వృత్తి కాదని సమాజానికి అద్దంపట్టే ఒక శక్తి వంతమైన సాధనమని యూనియన్ మండల అధ్యక్షులు నాసాని విద్యా సాగర్ అన్నారు. ప్రతి ఫోటో వెనుక ఒక కథ ఉంటుంది. అనే నినాదంతో ఫోటోగ్రఫీ యూనియన్ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. యూని యన్ మండల అధ్యక్షులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మొగుళ్ళపల్లి ఎస్సై ముప్పు సురేష్, స్థానిక సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ పాల్గొన్నారు. యూనియన్ అధ్యక్షులు నాసాని విద్య సాగర్ మాట్లాడుతూ, ఫోటోగ్రఫీ అనేది కేవలం వృత్తి కాదని, అది సమాజానికి అద్దం పట్టే ఒక శక్తివంతమైన సాధనమని అన్నారు. ఈ సందర్భంగా ఎస్సై ముప్పు సురేష్ మాట్లాడుతూ, శాంతిభద్రతల నిర్వహణలో, నేరాల ఛేదనలో ఫోటోలు, వీడియోల పాత్ర చాలా కీలకమని అన్నారు. సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేస్తున్న ఫోటోగ్రాఫర్ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బాలవేణి వీరస్వామి, ప్రధాన కార్యదర్శి నాగపురి తిరుపతి, గౌరవ అధ్యక్షులు పెండం రాజేందర్, భూపాలపల్లి ఉపాధ్యక్షులు నాగపురి శ్రీనివాస్, సభ్యులు పాల్గొని స్వీట్లు పంపిణీ చేశారు.

# మిత్రుడి కుటుంబానికి బాల్యమిత్రుల ఆర్థిక సాయం




**చిట్యాల, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రానికి చెందిన కీర్తిశేషులు కర్నే రాయమల్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబం విషాదంలో మునిగింది. మృతుడి కుమారుడు కర్నే కమలాకర్ చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివారు. కమలాకర్‌తో కలిసి చదువుకున్న బాల్యమిత్రులు మానవత్వాన్ని చాటుకున్నారు. బుధవారం రాయమల్లు దశదినకర్మ సందర్భంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బాల్యమిత్రులు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా బాల్యమిత్రులంతా కలిసి జమ చేసిన రూ.24 వేలు ఆర్థిక సాయంగా కమలాకర్ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బాల్యమిత్రులు చింతల మహేందర్ మురహరి భానుచందర్ పోతారపు మహేష్ పాశీగంటి మహేందర్ రాయిని శ్రీకాంత్ గుండ తిరుపతి చిలుముల రాజేష్ దూడపాక రాజేందర్ సిలివేరు రవీందర్ కట్కూరి కుమార్ కలికోట లక్ష్మణ్ చింతకింది సతీష్ నేరెళ్ల సురేష్ కీర్తి సాయి కృష్ణ గుర్రం రాజేందర్ బూడిద రవి తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ స్కూల్ పోస్టర్ ఆవిష్కరణ



**చిట్యాల, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** చిట్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ పోస్టర్ ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ వివిధ కారణాలతో చదువు మానేసిన వ్యక్తులకు ఇది ఒక వరమని అన్నారు. ఓపెన్ టెన్త్ కోసం పుట్టిన తేదీ ధ్రువీకరణ ఆధార్ కార్డు కుల ధ్రువీకరణ ఒకవేళ ఉంటే రెండు పాస్ ఫోటోలు అవసరమని ఓపెన్ ఇంటర్ కోసం పదవ తరగతి మెమో ఆధార్ కార్డు కుల ధ్రువీకరణ ఒకవేళ ఉంటే రెండు పాస్ ఫోటోలు, నిర్ణీత ఫీజుతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిట్యాల నందు సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధాన ఉపాధ్యాయులు శ్రీరామ్ రఘుపతి బొమ్మ రాజమౌళి, బుర్ర సదయ్య సరళ దేవి రామ్ నారాయణ శ్రీనివాస్ ఉస్మాన్ అలీ శంకర్ విజయలక్ష్మి సాంబమూర్తి సుజాత తదితరులు పాల్గొన్నారు.

# మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేళ పచ్చదనం పండుగ



**చెన్నూర్, ఆగస్టు19(పీపుల్స్ డైరీ) :** చిత్ర సీమలో నటుడిగానే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుండే మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని చెన్నూర్ నియోజకవర్గంలో పచ్చదనం పరిమళించింది. మెగా యూత్ ఫోర్స్ మంచిర్యాల జిల్లా నాయకుడు సిద్దు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో బృహత్తర మొక్కలు నాటే కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెగా యూత్ ఫోర్స్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ కాసరాజు, పాఠశాల ఆవరణలో మొదటి మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో చెన్నూర్ టీమ్ సీనియర్ జనసేన నాయకులు రాజా రవికిరణ్, బాలు, సాయి మామిడి, రఘు, సాయి కిరణ్, పొన్నం సాయి, సాయి ఆడేటి ప్రత్యేకంగా పాల్గొన్నారు. వీరితో పాటు చెన్నూర్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అలగం సాయికుమార్ హాజరై విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పాఠశాల ప్రాంగణమంతటా పలు రకాల మొక్కలను నాటారు.

# అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

## ప్రజలకు పూర్తి ప్రయోజనం అందించాలి: దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి

**జాతీయ రహదారుల పనులు వేగవంతం చేసి భూసేకరణ సమస్యలను పరిష్కరించాలి**

**గురుకులాలు, పాఠశాలల్లో ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి**

**సన్నబియ్యం పంపిణీలో అక్రమాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలి**

**అమృత్ 2.0 పనులను వేగవంతం చేసి విలీన ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి**

**ఖమ్మం రైల్వే స్టేషన్ పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేసి ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి**

**దిశా కమిటీ సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, పనుల పురోగతిపై సమీక్ష**




**ఖమ్మం, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** ఖమ్మం జిల్లా అభివృద్ధికి చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి కార్యక్రమం ద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఖమ్మం ఎంపీ, దిశా కమిటీ చైర్మన్ రామ సహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన దిశా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి నిర్వహించారు. గత దిశా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై అధికారులు సమర్పించిన యాక్షన్ టేకన్ రిపోర్టును సమావేశంలో పరిశీలించారు. జాతీయ రహదారులు, నీటిపారుదల, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, గ్రామ పంచాయతీ, గిరిజన సంక్షేమం, మార్కెటింగ్, వ్యవసాయం, డీఆర్‌డీఏ, మహిళా శిశు సంక్షేమం, పౌరసరఫరాలు, విద్య, వైద్యం, మున్సిపాలిటీలు, మత్స్యశాఖ, తదితర శాఖల ద్వారా అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ... అభివృద్ధి పనులను కేవలం మంజూరు చేయడంతో సరిపెట్టకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పనుల అమలులో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని గుర్తించి వెంటనే పరిష్కరించాలని, నిధులు లేదా అనుమతులకు సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వ స్థాయిలో అవసరమైన చర్యలు తీసుకునేలా ఫాలో అప్ చేస్తామని తెలిపారు. జాతీయ రహదారుల పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన భూ సేకరణను త్వరగా పూర్తి చేసి, క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖలో పూర్తయిన అన్ని పనులను సంబంధిత స్థానిక ఎమ్మెల్యేలకు అప్పగించాలని, ఉపాధి హామీ పనుల క్రింద మంజూరైన వీఓ భవనాల వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఎంపీ ల్యాడ్స్ ద్వారా త్రాగునీటి కోసం మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీ సూచించారు. పనుల్లో అవసరమైన సవరణలు, మార్పులు ఉంటే సంబంధిత ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. డీఎంఎఫ్‌టీ నిధులను వినియోగించిన వివరాలను సమర్పించాలని, డీఎంఎఫ్‌టీ కమిటీ సమావేశాన్ని త్వరగా నిర్వహించి, ఇకపై సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న మౌళిక వసతుల లోటుపాట్లపై సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించాలని ఎంపీ ఆదేశించారు. ప్రతి కేంద్రంలో మరుగుదొడ్లు, త్రాగునీరు, విద్యుత్, ఇతర ప్రాథమిక వసతులు పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలని, క్షేత్రస్థాయిలో గుర్తించిన ప్రతి లోటును త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గ్యాస్ కనెక్షన్లకు అర్హత ఉన్న కుటుంబాలను గుర్తించేందుకు సర్వే నిర్వహించి నివేదిక సిద్ధం చేయాలని అన్నారు. జిల్లాలోని అన్ని గురుకులాలు, పాఠశాలల్లో ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి ఆదేశించారు. తనిఖీల సమయంలో పాఠశాలలు, గురుకులాల పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను తప్పని సరిగా పరిశీలించాలని అన్నారు. తరగతి గదుల్లో బోధన ఎలా జరుగుతుందో కూడా గమనించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నదా లేదా అనేది క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. తనిఖీలకు ముందుగా పాఠశాలలకు ఎలాంటి సమాచారం ఇవ్వకూడదని, వాస్తవ పరిస్థితులను తెలుసుకునేలా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వం పిల్లల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నందున ఆ నిధుల ప్రయోజనం క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు నిశితంగా పర్యవేక్షించాలని ఎంపీ అన్నారు. బ్లాక్ మార్కెటింగ్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఎక్కడెక్కడ బ్లాక్ మార్కెటింగ్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయో గుర్తించి, సంబంధిత ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి అక్రమాలకు పాల్పడే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో అమృత్ 2.0 నిధులతో చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎంపీ అన్నారు. పనులకు అవసరమైన భూ కేటాయింపులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. అన్ని మున్సిపాలిటీల్లో డ్రైనేజీ, త్రాగునీటి పనులను వేగవంతం చేయాలని,ముఖ్యంగా విలీన ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఖమ్మం రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు రైల్వే భూముల మార్పిడి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఎంపీ సూచించారు. ఖమ్మం రైల్వే స్టేషన్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి డిసెంబర్ 2026లోగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ల్యాండ్ డెవలప్‌మెంట్ మాస్టర్ ప్లాన్‌కు త్వరగా ఆమోదం పొందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... వరంగల్-- ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లాలో కొత్త విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి ప్రభుత్వం కొత్త విధానం తీసుకువచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఒక కిలోమీటర్ లోపు దూరంలో విద్యుత్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటే చార్జీలు ఉచితంగా ఉంటాయని, మీటర్ కోసం డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలో కొత్త విద్యుత్ కనెక్షన్లకు సంబంధించిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏఐబీపీ--ఎస్ఆర్ఎస్‌పీ స్టేజ్--2 క్రింద ఈ ఏడాది 8.6 కిలోమీటర్ల పనుల్లో 41 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈపీసీ విధానంలో పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ఫేజ్--1లో రెండు వంతెనలు, 16 రహదారుల పనులు పూర్తయ్యాయని, ఒక వంతెన పని పురోగతిలో ఉందన్నారు. ఫేజ్--2లో నాలుగు వంతెనలు మంజూరు కాగా ఒకటి పూర్తయిందని, రెండు టెండర్ దశలో, ఒకటి పురోగతిలో ఉందని వివరించారు. పోషకాహార పునరావాస కేంద్రం ద్వారా 61 మంది చిన్నారులకు చికిత్స అందించామని, ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం క్రింద సుమారు 62 వేల మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 100 శాతం మరుగుదొడ్లు, త్రాగునీరు, విద్యుత్, ఇతర ప్రాథమిక వసతులు కల్పిస్తున్నామని అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన లోటుపాట్లను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, నామినేటెడ్ సభ్యులు, జిల్లా అధికారులు, సర్పంచులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వేదాల సారాంశం సమాజానికి ఆదర్శం

### చతుర్వేద పరిచయం' పుస్తక ఆవిష్కరణలో మంత్రి పొంగులేటి

**ఖమ్మం, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** మన సనాతన ధర్మానికి ముఖ్యాధారాలైన నాలుగు వేదాలు, ఉపనిషత్తులలోని అమూల్యమైన ఆధ్యాత్మిక విషయాలను సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యేలా సులభ శైలిలో అందించడం అభినందనీయమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం వీడీఓ కాలనీకి చెందిన విశ్రాంత దేవాదాయ శాఖాధికారి (ఈఓ) ఇందూరు కృష్ణమాచారి రచించిన 'చతుర్వేద పరిచయం' అనే ఆధ్యాత్మిక గ్రంథాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ సాధారణంగా చదవడానికి కఠినంగా ఉండే వేదాలలోని ముఖ్యాంశాలను అధ్యయనం చేసి, వాటి సారాంశాన్ని సమాజానికి ఉపయోగపడేలా పుస్తకరూపంలో తీసుకురావడం శుభపరిణామమన్నారు. ఈ గ్రంథం ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంపొందించడానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత ఇందూరు కృష్ణమాచారి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మిక్కిలినేని నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్లో బుక్‌స్టాల్ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలి

### కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీధర్



**చిట్యాల, ఆగస్టు 19(పీపుల్స్ డైరీ) :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మాంటిస్సోరి స్కూల్‌లో విద్యార్థుల నుంచి పుస్తకాలు స్పోర్ట్స్ యూనిఫామ్స్ టీషర్ట్స్ తదితర వస్తువుల పేరుతో నగదు వసూలు చేస్తూ సరైన జీఎస్టీ బిల్లులు ఇవ్వకుండా రశీదులు అందిస్తున్న మిలీనియం బుక్ స్టాల్ వ్యవహారంపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీధర్ ఆరోపించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ స్కూల్ రన్నింగ్ అవర్స్‌లోనే విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు టెక్స్ట్ బుక్స్ టీషర్ట్స్ స్పోర్ట్స్ యూనిఫామ్స్ తదితర వస్తువులు మిలీనియం బుక్ స్టాల్ ద్వారా విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆరోపించారు. విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న నగదుకు సరైన పన్ను వివరాలు కలిగిన బిల్లు ఇవ్వకుండా చేతిరాత రశీదులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు సమాచారం, పారదర్శక ధరల వివరాలు చెల్లుబాటు అయ్యే బిల్లులు లేకుండా విద్యార్థులపై పుస్తకాలు యూనిఫామ్స్ కొనుగోలు విషయంలో ఒత్తిడి ఉంటే అది తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని శ్రీధర్ అన్నారు. స్కూల్‌లో బుక్‌స్టాల్ నిర్వహణకు ఎలాంటి అనుమతులు ఉన్నాయని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. విక్రయాలకు సంబంధించి జీఎస్టీ రిజిస్ట్రేషన్ బిల్లింగ్ విధానం ధరల నిర్ణయం ఎలా ఉంది..? అనే అంశాలపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేయాలని కోరారు. అనుమతులు లేకుండా బుక్‌స్టాల్ నిర్వహిస్తున్నట్లు తేలితే వెంటనే మూసివేయాలన్నారు. విద్యార్థుల నుంచి అధిక ధరలు వసూలు చేసినా పన్ను నిబంధనలు ఉల్లంఘించినా సరైన బిల్లులు ఇవ్వకపోయినా సంబంధిత శాఖలు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులపై అనవసర ఆర్థిక భారం మోపకుండా స్కూల్ యాజమాన్యం పారదర్శకంగా వ్యవహరించాలని విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు మరియు యూనిఫామ్స్ కొనుగోలులో తల్లిదండ్రులకు సరైన ఎంపిక స్వేచ్ఛ కల్పించాలని ఆయన కోరారు. ఈ వ్యవహారంపై విద్యాశాఖ వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తక్షణమే తనిఖీ నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందు వెల్లడించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి శ్రీధర్ డిమాండ్ చేశారు.

### ఆరోపణలు అవాస్తవం : కెవి రావు డైరెక్టర్

శ్రీధర్ ఆరోపణల్లో వాస్తవం లేదని పాఠశాలలో విద్యార్థులకు ఇస్తున్న వస్తువులపై జీఎస్టీ ఉంటుందనిపాఠశాల సమయంలోనే విద్యార్థులకు కావలసిన వస్తువులుఅందజేస్తున్నామన్నారు.

## బీఆర్ఎస్ నాయకులు శవ రాజకీయాలు మానుకోవాలి

### నర్సంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



**నర్సంపేట, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** బీఆర్ఎస్ నాయకులు నర్సంపేట బంద్‌కు పిలుపునివ్వడంపై నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మరియుదుగ్గొండి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చుక్క రమేష్ ధ్వజమెత్తారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దత్తపుత్రుడిగా, దివంగత మాజీ శాసనసభ్యుడు పెద్ది సుదర్శన్ రెడ్డిగా చెప్పుకుని తిరిగే బీఆర్ఎస్ నాయకులు గుండెపోటుతో మరణించిన మీ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తెలంగాణ భవన్ ముందు ఏర్పాటు చేసి, తెలంగాణ భవన్‌కు పెద్ది సుదర్శన్ రెడ్డి భవన్‌గా నామకరణం చేసుకోవాలని అన్నారు.అంతేగానీ నర్సంపేటలో శవ రాజకీయాలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు.ఇటువంటి శవ రాజకీయాలు చేస్తూ తమ నాయకుడు, నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవ రెడ్డి బద్నాం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం తన పని తాను చేసుకుంటూ పోతుందని, చట్టం ఎవరికి చుట్టం కాదని తన పని తాను చేసుకుంటూ పోతుందని, చట్టానికి ఎవరైనా తలవంచి పనిచేయాల్సిందేనని అన్నారు. ప్రశాంతమైన నర్సంపేట గడ్డపై శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా కక్ష సాధింపు,కవ్వింపు రాజకీయాలు చేయాలని చూస్తున్నది బీఆర్ఎస్ నాయకులేనని ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తలు క్రమశిక్షణ కలిగిన వారు కాబట్టి బీఆర్ఎస్ నాయకులు ఇన్ని శవ రాజకీయాలు చేస్తున్నా సహనంతో ఉంటున్నారని, ఇప్పటికైనా తమ వ్యవహారశైలిని మార్చుకోకుంటే కాంగ్రెస్ నాయకులు తమ సంయమనం వీడాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు అన్యాయం జరగకూడదనే అంకిత భావంతో పనిచేస్తోందని నియోజకవర్గ కన్వీనర్ తో కల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు కనువిప్పు చేసుకొని శవ రాజకీయాలు,విగ్రహ రాజకీయాలు మానుకోవాలని చుక్క రమేష్ సూచించారు లేకుంటే మండలంలో చర్యకు ప్రతి చర్యకు దిగాల్సిన పరిస్థితి వస్తుందని మండల పార్టీ అధ్యక్షులు చుక్క రమేష్ హెచ్చరించారు . నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి దేవాదుల ద్వారా 200 కోట్ల నిధులు పనులు దేవాదుల ద్వారా రంగాయి చెరువు రిజర్వాయర్ గా మారిస్తే ,నర్సంపేట నియోజకవర్గంలోని నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపూర్, చెన్నారావుపేట మండలాల రైతులకు సాగునీటి త్రాగునీటి సమస్య ఉండదని జరుగుతున్న పనులను అడ్డుకోవడానికి బిఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని,ప్రజలు, రైతుల దృష్టిలో తమ నాయకుడిపై దుష్ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ నాయకులు పబ్బం గడుపుకుంటున్నారని ఆయన వారు మండిపడ్డారు ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్‌లు క్లస్టర్ ఇంచార్జీలు సర్పంచులు గ్రామ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు మండల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## పాత వీడియోతో కొత్త డ్రామా..!

**ఎడిట్ చేసి నిన్నటి ఘటనగా చిత్రీకరణ**

**రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపణ**

**కాంగ్రెస్ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తా**

**మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహా రావు**



**భూపాలపల్లి, ఆగస్టు 18 (పీపుల్స్ డైరీ) :** పాత వీడియోను ఎడిట్ చేసి, అది నిన్న జరిగిన ఘటనగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావు ఆరోపించారు. వాస్తవాలను వక్రీకరిస్తూ తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌కు చెందిన ఐఎన్‌సీ భూపాలపల్లి (×చీజబిదీష్ట్రబజుఖుశ్రీఖుజుఖుశ్రీశ్రీఎ) ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తనకు సంబంధించిన పాత వీడియోను ఎడిట్ చేసి, నిన్నటి ఘటనగా ప్రచారం చేశారని ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగతంగా తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు.

### మార్చి 10న ఘటన

మార్చి 10న యూనివర్సిటీ క్రాస్ సమీపంలో ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి తన కారును ఢీకొట్టి అక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నించారని లక్ష్మీనరసింహారావు తెలిపారు. వారిని అడ్డుకునే క్రమంలో జరిగిన వివాదానికి సంబంధించిన కొంత భాగాన్ని మాత్రమే వీడియోగా తీసుకుని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఘటనపై అప్పట్లోనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైందని, ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో ఉందని తెలిపారు.

### 'రమణారెడ్డి అనుచరుడినే'

తాను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అనుచరుడిననే విషయాన్ని బహిరంగంగానే చెబుతున్నానని అన్నారు. రాజకీయ జీవితంలో మొదటి నుంచీ ఆయనతోనే కొనసాగుతున్నానని తెలిపారు. పేదలు, ప్రజలకు సేవ చేయడం, రాజకీయాల్లో నిబద్ధతతో ఉండటం వంటి విలువలను ఆయన నుంచి నేర్చుకున్నామని పేర్కొన్నారు. తమ నాయకుడి పేరును ప్రస్తావిస్తూ తప్పుడు ప్రచారం చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని అన్నారు.

### ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కేసులా...?

గణపురం ప్రాంతంలోని వంతెన నిర్మాణం, చెరువుకు నీటి విడుదల వంటి ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ప్రజల తరఫున ప్రశ్నించినందుకు తమపై, నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టడం, ఆరోపణలు చేయడం పరిపాటిగా మారిందని ఆరోపించారు. ప్రజా ఒత్తిడి, తమ పోరాటం తర్వాతే సంబంధిత సమస్యలపై ప్రభుత్వం స్పందించిందని పేర్కొన్నారు.

### 'ఇక మౌనంగా ఉండం'

పాత ఘటనలను కొత్తవిగా చూపిస్తూ వీడియోలను ఎడిట్ చేసి ప్రచారం చేయడం మానుకోవాలని లక్ష్మీనరసింహారావు హెచ్చరించారు. తనపై, తమ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారం కొనసాగితే ఇకపై మౌనంగా ఉండబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నామని, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజకీయ విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే వ్యక్తిగతంగా కించపరిచేలా తప్పుడు వీడియోలను ప్రచారం చేయడం సమంజసం కాదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో గణపురం, భూపాలపల్లి నాయకులు, పట్టణ మాజీ అధ్యక్షులు కటకం జనార్ధన్, మాజీ మండల అధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రా రెడ్డి, జిల్లా నాయకులు సెగ్గెం సిద్దూ, మాడ హరీష్ రెడ్డి పిన్నింటి శ్రీనివాస్ రావు, సింగణవేణి చిరంజీవి, మాజీ కౌన్సిలర్ మురళీ, హఫీజ్, గాజర్ల చింటూ గౌడ్, మామిండ్ల సాంబయ్య, పిన్నింటి మణిదీప్ రావు, మహేందర్, పబ్బ రవీందర్, మార్క సాయిగౌడ్, వాజీత్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ నిబంధనలు పాటిస్తేనే అనుమతులు

**నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు : కమిషనర్ వెంకన్న**



**మట్టెవాడ, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ):** భవన నిర్మాణ నిబంధనలను ఖచ్చితంగా పాటించినప్పుడే అనుమతులు మంజూరు చేస్తామని, అనుమతించిన నిర్మాణ ప్రణాళిక (శాంక్షన్డ్ ప్లాన్) ప్రకారమే భవనాలు నిర్మించిన వారికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు (ఓసీ) జారీ చేస్తామని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను కమిషనర్ క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. హంటర్ రోడ్, ప్రకాశ్‌రెడ్డి పేట, నక్కలగుట్ట, జూలైవాడ, ఎక్సైజ్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించిన ఆయన, నిర్మాణాలను పరిశీలించి, భవనాల కొలతలను వేయించారు. అనుమతించిన నిర్మాణ ప్రణాళికకు అనుగుణంగానే భవనాలు నిర్మించారా? లేదా? అనే అంశాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ నగరంలో కొత్తగా భవన నిర్మాణాలు చేపట్టే యజమానులు తప్పనిసరిగా మున్సిపల్ శాఖ నుంచి ముందస్తు అనుమతులు పొందాలని సూచించారు. అనుమతించిన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. భవన యజమానులు మంజూరైన ప్లాన్ ప్రకారమే నిర్మాణాలను పూర్తి చేసి, అనంతరం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిర్మాణ అనుమతులు, భవన నిర్మాణ నిబంధనలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల విషయంలో ఎలాంటి ఉల్లంఘనలకు తావు లేకుండా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. ఈ తనిఖీల్లో సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ప్రశాంత్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అవినాష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# నూనె మిల్లులో ప్రమాదం

**మహిళ చేయికి తీవ్ర గాయాలు**

**నల్లబెల్లి, ఆగస్ట్ 19 (పీపుల్స్ డైరీ) :** నల్లబెల్లి మండల కేంద్రంలోని ఓ నూనె మిల్లులో జరిగిన ఘోర ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడ్డారు. రంగాపురం గ్రామానికి చెందిన కందగట్ల కవిత వృత్తిరీత్యా రంగాపురం మహిళ బ్యాంక్‌లో పనిచేస్తున్నారు. కవిత తన గృహ అవసరాల నిమిత్తం నూనె పట్టించుకోవడానికి నల్లబెల్లి మండల కేంద్రంలోని స్థానిక నూనె మిల్లుకు వచ్చారు. యంత్రంలో నూనె గింజలు వేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఆమె చేయి యంత్రం పళ్లచక్రాల మధ్య ఇరుక్కుపోయింది. యంత్రం బలంగా తిరుగుతుండటంతో ఆమె చేయి నలిగి, ఎముకలు విరిగి తీవ్రంగా తెగిపోయింది. ఈ ప్రమాదంతో బాధితురాలు తీవ్ర నొప్పితో అల్లాడిపోయారు. బాధితురాలి ఆర్తనాదాలు విన్న మిల్లు సిబ్బంది, స్థానికులు వెంటనే అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అందరూ కలిసి ఎంతో శ్రమించి యంత్ర భాగాలను సడలించి ఆమె చేయిని బయటకు తీశారు. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న కవితకు



ప్రాథమిక చికిత్స అందించి, తక్షణమే మెరుగైన వైద్యం కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనకు సంబంధించి పోలీసులు విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# నూతన బోధనా పద్ధతులు పాటించాలి!

**డీఐఈఓ డాక్టర్ జి.శ్రీధర్ సుమన్**



**మట్టెవాడ, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ):** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఇంటర్ అధ్యాపకులు ఎప్పటికప్పుడు తమ బోధనా పద్ధతులను నవీకరించుకోవాలని వరంగల్ జిల్లా మాధ్యమిక విద్యాధికారి డాక్టర్ జి.శ్రీధర్ సుమన్ అన్నారు. ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరంలో మారిన సిలబస్ తదితర అంశాలపై మూడు స్పెల్ లలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని డిఐఈఓ శ్రీధర్ సుమన్ పర్యవేక్షించారు. హన్మకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమైన గణితం, హిస్టరీ, హిందీ సబ్జెక్టుల శిక్షణా కార్యక్రమంలో ప్రాల్గొని అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. ఈ విద్యా సంవత్సరం నుండి అన్ని సబ్జెక్టులకు అంతర్గత మూల్యాంకనం ఉందని, వార్షిక పరీక్షకు 80 మార్కులు, 20 మార్కులు అంతర్గత మూల్యాంకనం కొరకు నిర్ధారించబడింది. సైన్స్ సబ్జెక్టుల్లో బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు ప్రాక్టికల్స్ ప్రథమ సంవత్సరం 15 మార్కులు, ద్వితీయ సంవత్సరం 15 మార్కులుగా విభజించబడింది. గణితం సబ్జెక్టుకు కూడా 75 మార్కుల్లో 60 మార్కుల వార్షిక పరీక్ష 15 అంతర్గత మూల్యాంకనంకు నిర్ధారించబడింది. అధ్యాపకులు విద్యార్థులచే నిరంతర మూల్యాంకనం, అభ్యసనం, మార్కుల విభజన తదితర అంశాలపై విస్తృత అవహన పెంచుకోవాలని ఆయన సూచించారు. ఈ ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రాంలో హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలకు చెందిన అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. ప్రతీ స్పెల్ కు రెండు రోజుల చొప్పున మూడు స్పెల్ లలో 11 సబ్జెక్టులకు శిక్షణనిచ్చారు. సంబంధిత పాఠ్యాంశంలో సీనియర్ అధ్యాపకులను ఎంపిక చేసి వారికి హైదరాబాద్ లో శిక్షణనిచ్చారు. సీనియర్ అధ్యాపకులు, వివిధ కళాశాలల్లోని అధ్యాపకులతో "పరస్పర జ్ఞాన సముపార్జన" పద్ధతిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు, మాధవరావు, పరశురాం, శ్రీదేవి, అధ్యాపకులు, రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

# లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఫోటోగ్రాఫర్లకు సన్మానం

**కనుమరుగవుతున్న ఫోటోగ్రఫీ సంఘానికి ఊతం ఇవ్వాలి : అధ్యక్షుడు శ్రీరాములు**




**కేసముద్రం, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** కేసముద్రం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఫోటోగ్రఫీ సంఘం సభ్యులను సన్మానించే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫోటోగ్రఫీ సంఘం కేసముద్రం ఫోటో గ్రాఫర్ మండల అధ్యక్షులు డోలి రాజేష్ కుమార్ కోశాధికారి పింగిలి నాగరాజు సీనియర్ ఫోటోగ్రాఫర్ బండారు బ్రహ్మం మహబూబాద్ కు చెందిన ఫోటోగ్రాఫర్ జెరిపోతుల మధు హాజరై సన్మానాలు అందుకున్నారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీరాములు మాట్లాడుతూ కనుమరుగవుతున్న ఫోటోగ్రాఫర్ సంఘాన్ని తిరిగి వెలుగులోకి తీసుకువచ్చి దానికి రూపురేఖలు దిద్దేందుకు ఇలాంటి సన్మాన కార్యక్రమాలు అవసరమని అన్నారు. సమాజంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలకం. ప్రతి వేడుకను, ప్రతి జ్ఞాపకాన్ని శాశ్వతంగా నిలిపేవారు వారే. అలాంటి ఫోటోగ్రాఫర్లను గౌరవించడం మన బాధ్యత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ కేసముద్రం కోశాధికారి మడిపెద్ది వెంకటేష్ తో పాటు క్లబ్ సభ్యులు, స్థానిక ఫోటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే హెచ్ 143 నూతన మండల కమిటీ



**కేసముద్రం, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** మండలం పరిధిలో పనిచేస్తున్న విలేకరుల నూతన మండల కమిటీని మంగళవారం సాయంత్రం ఎన్నుకోవడం జరిగింది. మంగళవారం సాయంత్రం టీయూడబ్ల్యూజే హెచ్ 143 అనుబంధ మండల కమిటీ అధ్యక్షుడిగా వార్త దినపత్రిక విలేఖరి ఏసల్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా సోమారపు శ్రీరాములు, జన్ను శ్రీను, ప్రధాన కార్యదర్శిగా కూన శ్రీను, సహాయ కార్యదర్శులుగా పందుల రవిచంద్ర, వల్లాల కాశ్మీనాథ్, కోశాధికారిగా వేల్పుల రేవంత్ యాదవ్, కార్యవర్గ సభ్యులుగా మిట్టగడుపుల మహేందర్, గాజుల రవి, చంద్రగిరి వంశీకృష్ణ, శీలం దామోదర్, బోడ ప్రశాంత్ లను ఎన్నుకున్నట్లు కన్వీనర్ మద్దినేని గుట్టయ్య, కో కన్వీనర్ గాడిపెల్లి శేఖర్ లు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ ఎన్నిక కన్వీనర్ మద్దినేని గుట్టయ్య మాట్లాడుతూ పత్రికా రంగంలో పనిచేస్తున్న ప్రతి విలేకరికి ఎల్లప్పుడూ అండగా టియుడబ్ల్యూజే హెచ్ 143 ఉంటుందని, ప్రతి ఒక్కరూ సహకరించుకుంటూ యూనియన్ బలాన్ని పెంచాలని కోరారు. అలాగే మండలం నుండి అధిక సంఖ్యలో సభ్యత్వాలను చేపట్టాలని సూచించారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు కల్పించాలి

**సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్**



**ఇనుగుర్తి, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్యా మురళి నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వసతి గృహం, వంటగది, భోజనశాల తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఎమ్మెల్యే మురళి నాయక్ నేరుగా మాట్లాడి వారి చదువు, భోజనం, వసతి, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందుతున్న భోజనం నాణ్యతను పరిశీలించి, వారికి నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలికలు చదువులో ముందంజలో ఉండేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఈసారి బ్రతకడానికే పంటలు వేసుకుందాం

**ఎమ్మెల్యే మురళి నాయక్**



**కేసముద్రం, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** వరుస కరువులు, పెరిగిన పెట్టుబడుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే మురళి నాయక్ అన్నారు. ఈసారి లాభం కోసం కాదు కుటుంబం బ్రతకడానికే పంటలు వేసుకుందామనే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కేసముద్రం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ రైతులకు కీలక సూచనలు చేశారు. "ఈసారి ఆరు తడి పంటలు వేయాలి. సమ్మిశ్ర పంటలు వేయడం వల్ల రైతులకు లాభాలు వస్తాయి" అని అన్నారు. "కరెంట్ అధికారులు సక్రమంగా పని చేయకపోతే సస్పెండ్ చేస్తా" అని హెచ్చరించారు. అదే సమయంలో అధికారులకు సూచనలు చేస్తూ "సర్పంచ్ గ్రామానికి ప్రథమ పౌరుడు. కాబట్టి అధికారులు సర్పంచ్ ఫోన్ లిఫ్ట్ చేయాలి, పని చేయాలి. సర్పంచ్ మాట వినాలి" అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, పిడి మధుసూదన్ ఎమ్మార్వో ఎంపీడీవో అగ్రికల్చర్ ఆఫీసర్ వెంకన్న అంబటి మహేందర్ రెడ్డి రావుల మురళి కేసముద్రం మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు కరెంట్ అధికారులు, కార్యదర్శులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఒక్క ఫొటో కోట్ల మాటలకు సమానం



**నల్లబెల్లి, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్లబెల్లి మండల కేంద్రంలో ఫోటో యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సంఘ గౌరవ అధ్యక్షుడు పడాల మురళి జెండా ఆవిష్కరణ చేశారు. ఫోటోగ్రఫీ పితామహుడిగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి యూనియన్ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాగురే సేవలను వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరిగే విభిన్న సంఘటనలను, శుభకార్యాలను తన కెమెరాలో బంధించి మధుర జ్ఞాపకాలుగా అందించడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర అభినందనీయమని కొనియాడారు. ఒక చిత్రం కోట్ల మాటలు మాట్లాడుతుంది, ఒక చిత్రం వేల ప్రశ్నలు సంధిస్తుంది, ఒక చిత్రం లక్షల సమాధానాలకు సమానమని ఈ సందర్భంగా కొనియాడారు. మధుర జ్ఞాపకాలను పంచుకుంటూ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకు న్నారు. కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లు గోరంట్ల వెంకటేష్, కడియాల విజయ్ కుమార్, కూచన భాస్కర్, తాడేం సురేష్ పాల్గొని వేడుకలను దిగ్విజయం చేశారు.

# నర్సంపేటలో పెద్ది విగ్రహం తొలగింపుపై నిరసన

**నల్లబెల్లి, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట జిల్లా ఆస్పత్రి ఎదురుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి (పెద్దన్న) విగ్రహాన్ని అర్ధరాత్రి వేళ తొలగించడంపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, పెద్దన్న అభిమానులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. నల్లబెల్లి బస్టాండ్ ఆవరణలో నాయకులు, కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న రీతిలో తమ నిరసన తెలియజేశారు. ప్రధాన తొలగించిన స్థానంలోనే వెంటనే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తిరిగి పునఃప్రతిష్టించాలి. ప్రభుత్వం మరియు అధికారులు ఈ చర్యపై ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలి. ఈ నిరసన కార్యక్రమంలో బోట్ల పవన్, పరికి కోర్నెలు, ఆకుల సాంబరావు, అడ్డ రాజు, బోట్ల ఎల్లస్వామి, నత్తి శ్యామ్, గంగారపు వినయ్, రజినీకాంత్, పాషా, మనుగొండ సూర్యపవన్, కనకం యోహాన్, మేకల వెంకటేష్, రాజు తదితర నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు తదితర పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# భాషబోయిన కుటుంబానికి ఆర్థిక సహాయం



**దుగ్గొండి, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** దుగ్గొండి మండలం, మర్రిపల్లి గ్రామంలో అనారోగ్యంతో మరణించిన కీ"శే"భాషబోయిన సమ్మయ్య పార్థివ దేహానికి సర్పంచ్ డ్యాగం సుజాత సుధాకర్ నివాళులర్పించి వారి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుంట రాజుకుమార్, ఉప సర్పంచ్ బోయిని రంజిత్, మహ్మదాపురం మాజీ సర్పంచ్ తొట్ల కుమారస్వామి, నాయకులు, గ్రామస్తులు గాజు చిన్న రాజయ్య, భాషబోయిన సంజీవ, కుంట సాంబయ్య, దానం మొగిలయ్య, సోనబోయిన రవి, అంబీరు రజ్జన్న, మైదం లింగయ్య, కన్నెబోయిన సురేష్, ముద్దం రాజాలు, కుక్కముడి చిరంజీవి, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ డ్యాగం శివాజీ పాల్గొన్నారు.

# డెంగ్యూతో నాలుగేళ్ల బాలుడి మృతి




**కేసముద్రం, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని కల్వల గ్రామంలో డెంగ్యూ జ్వరంతో ఒక బాలుడు మృతి చెందిన సంఘటన విషాదం నింపింది. గ్రామానికి చెందిన ముప్ప శ్రీకాంత్ కుమారుడు ముప్ప నయాన్ష్ (నందు) (4). కొన్ని రోజులుగా జ్వరంతో బాధ పడుతున్న బాలుడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. చిన్న వయసులోనే బాలుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యా రు. గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దోమల బెడద ఎక్కువైంది. జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

# బంద్‌కు సహకరించిన అందరికి కృతజ్ఞతలు : తక్కళ్లపల్లి



**నర్సంపేట, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించడాన్ని నిరసిస్తూ పిలుపునిచ్చిన నర్సంపేట బంద్‌కు ప్రజలు, వ్యాపార వర్గాలు, విద్యా సంస్థలు పెట్రోల్ బంకుల నిర్వాహకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. పట్టణంలోని షాపులు, వాణిజ్య సముదాయాలు స్వచ్ఛందంగా మూతపడటంతో బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్ రావు మీడియాతో మాట్లాడుతూ... నర్సంపేటలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగడుతూ, పెద్ది సుదర్శన్ రెడ్డిపై ఉన్న అభిమానంతో బంద్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికి బిఆర్ఎస్ పార్టీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. "మూడు అడుగుల విగ్రహాన్ని తీసేయగలిగారేమో కానీ, లక్షలాది మంది ప్రజల గుండెల్లో ఉన్న పెద్ది సుదర్శన్ రెడ్డి అభిమానాన్ని ఎవరూ చెరిపివేయలేరు."అని అన్నారు.

# మార్త భద్రయ్య వర్ధంతి వేడుకలు



**గీసుకొండ, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** గీసుకొండ మండలం ఎల్కుర్తి గ్రామంలో నిమ్స్ లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ మార్త రమేష్, సత్యనారాయణ, రవి, కృష్ణల తండ్రి దివంగత మార్త భద్రయ్య వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, మార్త భద్రయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మార్త భద్రయ్య సమాజ సేవకు, కుటుంబ విలువలకు అందించిన సేవలను కొనియాడారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ మార్త రమేష్, వారి సోదరులు సత్యనారాయణ, రవి, కృష్ణ, కుటుంబ సభ్యులతో పాటు గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భద్రయ్యకు నివాళులర్పించారు.



## ప్రముఖ న్యాయవాదికి ఎంపీ పరామర్శ

**ఖమ్మం, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** ఇటీవల అస్వస్థతకు గురైన ప్రముఖ న్యాయవాది ముదిరెడ్డి నిరంజన్ రెడ్డిని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి బుధవారం బుర్హాన్ పురంలోని నిరంజన్ రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొర్లగూడెం పిఏసిఎస్ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి, వైరా అయ్యప్ప దేవస్థానం చైర్మన్ వెంకటకృష్ణ, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, మూడు వెంకన్న, రాజ్య తండా సర్పంచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## పింఛన్లు, సర్‌పై అడిషనల్ కలెక్టర్ సమీక్ష



**ఏన్కూరు, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూరులోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కొత్త ఫించన్లు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్ )పై జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ సమీక్ష చేశారు .కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెలాఖరు వరకు అవకాశం ఉందని, ప్రతి దరఖాస్తును పరిశీలించాలని అన్నారు.ఆన్ లైన్ దరఖాస్తు ప్రక్రియను అదనపు కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సర్ పై సమీక్ష చేశారు. అనామలిస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు ఇవ్వాలన్నారు నోటీసులు అందుకున్న వారు తమ ధరఖాస్తులతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలన్నారు. అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు ఈ కార్యక్రమంలో ఎండిఓ పల్లి భాగ్యశ్రీ, తాసిల్దార్ సిహెచ్ శేషగిరిరావు ,ఎంపీ ఓ ఖాదర్ మియా తదితరులు పాల్గొన్నారు

## ఏన్కూరులో మాజీ ఎంపీ పర్యటన



**ఏన్కూరు, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూరు మండలంలో బుధవారం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు పర్యటించారు .పలు కుటుంబాలను పరామర్శించారు. మండల టిడిపి సీనియర్ నాయకులు టిఎల్ పేట గ్రామానికి చెందిన కళ్యాణపు వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను నామా నాగేశ్వరరావు పరామర్శించారు. కళ్యాణపు వెంకటేశ్వరరావు చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు .రోడ్డు ప్రమాదంలో గాయపడిన బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి వెంకటేశ్వర రావును, దుగ్గిరాల రమేష్ ను ఆయన పరామర్శించారు . మాదినేని లెనిన్ ను నామా పరామర్శించారు. ఏన్కూరు లోని కమ్మవారి కళ్యాణ మండపంలో మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి అప్పారావు ,లకావత్ గిరిబాబు ,బానోత్ మనిషా లక్ష్మీ మదన్ లాల్, మోరంపూడి ప్రసాద్, తాళ్లూరి నరసింహారావు, జనార్ధన్, హరికృష్ణ నామ వెంకయ్య వెంకన్న, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.





# కబ్జా భూములు స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలి

**ఆక్రమణలపై క్షేత్రస్థాయి విచారణకు మంత్రి పొంగులేటి ఆదేశం**

**అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్ల స్థలం ఇస్తాం**

**పల్లెగూడెం సమగ్ర అభివృద్ధికి రూ.61.76 కోట్లు కేటాయించినట్లు వెల్లడి**



**ఖమ్మం, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** పల్లెగూడెంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను అక్రమంగా ఆక్రమించిన వారి నుంచి వెంటనే స్వాధీనం చేసుకుని, గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, ఆక్రమణలను గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో రూ. 20లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి అర్హుడికీ సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకోసమే భూములను సమీకరించి ఇళ్ల స్థలాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

**రూ.61.76 కోట్లతో ప్రగతి పరుగులు...**

పల్లెగూడెం సమగ్ర వికాసానికి రూ.61.76 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి ప్రకటించారు. గ్రామంలో ఇప్పటికే రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందని, గొల్లగూడెం నుంచి పల్లెగూడెం వరకు ఎన్ఎస్పీ కాల్వ గట్టుపై రూ.5.80 కోట్లతో మోడల్ సీసీ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా, పల్లెగూడెం నుంచి మంగళగూడెం వరకు రూ.55 కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రూ.20 లక్షల వ్యయంతో పంచాయతీ కార్యాలయ భవనాన్ని కేవలం రెండు నెలల వ్యవధిలోనే నాణ్యతతో పూర్తి చేయడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను మంత్రి అభినందించారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.12 లక్షలతో నూతన అంగన్‌వాడీ భవనా న్ని కూడా తక్షణమే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

## దివ్యాంగులకు ప్రభుత్వం అండ : మంత్రి పొంగులేటి

**ఖమ్మం, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో అర్హులైన 12 మంది లబ్ధిదారులకు 100% సబ్సిడీపై త్రీ వీలర్ (ట్రై మోటార్) సైకిళ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



**ఏన్కూరు, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏన్కూరు మండల ఫోటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవా౦ం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫోటోగ్రఫీ రంగం ప్రాధాన్యతను గుర్తుచేసుకుంటూ ఫోటోగ్రాఫర్లు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక సేవలో భాగంగా ఏన్కూరు మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమం నిర్వహించడం పట్ల పలువురు అభినందించారు. అనంతరం ఫోటోగ్రాఫర్ల సంఘం ఏన్కూరు మండల అధ్యక్షుడు బీరెల్లి పరమేష్ మాట్లాడుతూ రోజురోజుకూ ఫోటోగ్రఫీ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. రానున్న రోజుల్లో టెక్నాలజీ మరింత విస్తరించనున్న నేపథ్యంలో ప్రతి ఫోటోగ్రాఫర్ ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచుకుని, కాలానుగుణంగా తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఫోటోగ్రాఫర్లు పరస్పర సహకారంతో కలిసికట్టుగా ముందుకు సాగాలని, వృత్తిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏన్కూరు మండల ఫోటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు బీరెల్లి పరమేశ్, ఫోటోగ్రాఫర్లు కొవ్వూరి రామారావు, భూక్యా జగన్,శివ,నరేష్,సందీప్,గోపి కృష్ణ, సైదా, సుధాకర్, రాజు, రవి, సురేష్ పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలలను యథావిధిగా కొనసాగించాలి



**మణుగూరు, ఆగస్టు 19(పీపుల్స్ డైరీ) :** కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ పథకాలలను యథావిధిగా కొనసాగించాలని బీఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ గద్దల రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం అశ్వాపురం మండల తాహసీల్దార్ కి పెండింగ్ లో ఉన్న కళ్యాణ లక్ష్మి,షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూత్ ప్రెసిడెంట్ గద్దల రామకృష్ణ మాట్లాడుతూ...మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ పథకాలు తీసుకొచ్చారని కొనియాడారు.వాటి ద్వారా కేసీఆర్ మంచి పేరు వస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ పథకాలను తొలగించాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కరకగూడెం యూత్ ప్రెసిడెంట్ రంజిత్ కుమార్,అశ్వాపురం ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చల్లా రాజేష్,అశ్వాపురం యూత్ వైస్ ప్రెసిడెంట్ రాసాల రమేష్, గొల్లగూడెం సర్పంచ్ కొండ్రు సమ్మయ్య,బీసీ సెల్ అధ్యక్షులు అరసవెల్లి పవన్ యువజన నాయకులు మంగళగిరి రామకృష్ణ,జావిద్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి పనులపై సమీక్ష



**పంట కుంటలపై ప్రధాన దృష్టి**

**ఏన్కూరు, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూరు లోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ తమ శాఖల పరిధిలోని అభివృద్ధి పనుల గురించి వివరించారు. వీటిపై సమీక్ష చేశారు .ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ ఎండి ముజాహిద్దీన్ మాట్లాడుతూ, ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పంట కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణాలపై ప్రధాన దృష్టి సారించాలన్నారు .వీటి నిర్మాణం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయనీ, సాగునీటి అవకాశాలు మెరుగుపడతాయి అన్నారు. మండలంలో పంట కుంటల నిర్మాణ లక్ష్యాన్ని సాధించాలన్నారు .వీటిపై రైతులకు గ్రామాలలో అవగాహన కల్పించి, ఎక్కువ పంట కుంటల నిర్మాణాలు అయ్యే విధంగా అధికారులు కృషి చేయాలి అన్నారు. ఈ సమావేశంలో ఎండిఓ భాగ్యశ్రీ ,ఎంపిఓ ఖాదర్ మియా ,ఏవో నరసింహారావు , ఏఎంసీ చైర్మన్ లచ్చిరాం నాయక్ డాక్టర్ బాలకృష్ణ ,వివిధ శాఖల అధికారులు ,సర్పంచ్లు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులే కీలకం

**యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలకు విస్తరించాలి**



**ఏన్కూర్, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూర్ : పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములను చేయాలని సీజీఆర్ ఫౌండర్ కే. లక్ష్మారెడ్డి అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, ప్రకృతి విధ్వంసం, వాతావరణ మార్పులు భవిష్యత్ తరాలకు సవాళ్లుగా మారుతున్నాయని పేర్కొన్నారు. పర్యావరణ స్పృహతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవడం ద్వారా ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవచ్చన్నారు.ఏన్కూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి వాసవి అధ్యక్షతన నిర్వహించిన యంగ్ ఎర్త్ లీడర్స్ శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తే భవిష్యత్‌లో పర్యావరణహిత సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నేటి విద్యార్థులే రేపటి సమాజానికి నాయకులని అన్నారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రత, చెట్ల సంరక్షణ, నీటి పొదుపు, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడం వంటి అంశాలను విద్యార్థులకు ఆచరణాత్మకంగా నేర్పించాలని సూచించారు. ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అనే భావనను విద్యార్థుల్లో పెంపొందించాలని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతాయుతమైన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు..వైఈఎల్‌పీ రాష్ట్ర కోఆర్డినేటర్ యానాల వెంకటరెడ్డి మాట్లాడుతూ.. మానవుడి స్వార్థపూరిత జీవన విధానం ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, సీజీఆర్ ప్రతినిధులు నవ్య, శంకరయ్య, మద్దిలేటి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# పీడీఎస్ బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిపై పీడీ యాక్ట్

**ఖమ్మం, ఆగస్టు 19 (పీపుల్స్ డైరీ) :** పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ చేయడం, అంతర్రాష్ట్రాలకు తరలించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తూ అక్రమంగా ఆర్థిక లాభాలు ఆర్జిస్తున్న కాజా రామారావుపే జయంతి రామారావుపై పీడీ యాక్ట్‌ను అమలు చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా, వీరులపాడు మండలం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నిందితుడు కాజా రామారావు రేషన్ డీలర్లు, వారి ఏజెంట్ల ద్వారా కార్డుదారులకు అందాల్సిన సబ్సిడీ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా సేకరించేలా లబ్ధిదారుల బయోమెట్రిక్ వేలిముద్రలను దుర్వినియోగం చేసి బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయిస్తున్నట్లు తెలిపారు. 2026 ఏప్రిల్ 28 నుంచి మే 26 వరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని కల్లూరు, తల్లాడ, ఎర్రుపాలెం, చంద్రుగొండ



పోలీస్ స్టేషన్లలో నిందితుడిపై పీడీఎస్ బియ్యం అక్రమ కొనుగోలు సంబంధించి మొత్తం ఐదు కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఈ కేసుల్లో భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), ఎసెన్షియల్ కమాడిటీస్ యాక్ట్ (ఈసిఏ), తెలంగాణ పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్స్‌కు సంబంధించిన వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడిపై గతంలో పలుమార్లు కేసులు నమోదు కావడంతో పాటు, బిఎన్ ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేసినప్పటికీ తన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని, ఈ నేపథ్యంలో పీడీ యాక్ట్ అమలు చేసి సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తులింగం కాజా రామారావును బుధవారం అదుపులోకి తీసుకోని హైదరాబాద్‌లోని చంచల్‌గూడ సెంట్రల్ జైలు తరలించడం జరిగింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.


EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com